


శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

శ్రీశైలం, సెప్టెంబర్ 30: శ్రీశైలం జలాశయానికి సోమవారం వరద ప్రవాహం భారీగా కొనసాగింది. జూరాల నుంచి 72,715 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 8,892 క్యూసెక్కులు మొత్తం 81,607 వరద నీరు వస్తున్నది. సోమవారం సాయంత్రం 6 గంటలకు జలాశయానికి 61,022 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 880.40 అడుగులుగా నమోదైంది.



ఎస్‌బీఐ కాలనీలోని సర్వే నంబరు 2326/9లోని భూమి

ఇంకెన్నాళ్లు సాగదీస్తారు..!

నంద్యాల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): **గతంలో అధికార పార్టీ అండదండలతో నంద్యాలలో కబ్జారాయుళ్లు చెలరేగిపోయారు. విలువైన భూములను దొంగ పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేయించుకోవటంతో సామాన్యులు తమ సొంత భూముల్లో పరాయి వాళ్లుగా మిగిలిపోయారు. అవి తమ భూములేనని చెప్పే ధ్రువీకరణ పత్రాలు చూపించి స్థానిక టూ టౌన్‌లో కేసు పెట్టినా పట్టించుకున్న పాపాన పోలేదు. సాధారణంగా ఏదైనా విషయంలో కేసు నమోదైతే నిందితులను లేదా అనుమానితులను రెండు మూడు రోజుల్లో అరెస్టు చేసే పోలీసులు ఈ విషయంలో మాత్రం అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో నిందితులు నాలుగేళ్లుగా దర్జాగా బయట తిరుగుతున్నారు. వారికి వైసీపీ నేతల అండ ఉండటంతోనే గతంలో పోలీసులు ఏమాత్రం పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతైనా తమకు మేలు జరుగుతుందని భావిస్తున్నా కేసులో ఎలాంటి పురోగతి కనిపించటం లేదని బాధితులు ఆవేదన చెందుతున్నారు.**

- భూ కబ్జాదారులపై పోలీసుల చర్యలేవీ?
- 2020లో నంద్యాల టూ టౌన్‌లో కేసు నమోదు
- ఇప్పటికీ నిందితులను అరెస్టు చేయని వైనం
- కూటమి ప్రభుత్వంపై బాధితుల ఆశ
- నంద్యాలలో రూ.25 కోట్ల ఆస్తి వివాదం

అక్రమార్కుల కబ్జా

నంద్యాల పట్టణం ఎస్‌బీఐ కాలనీలోని సర్వే నంబరు 2326/9లో 2 ఎకరాల 55 సెంట్ల స్థలం ఉంది. దీనికి సంబంధించిన అసలు హక్కుదారు సిద్ధిబిరాం పక్కీర్ సాహెబ్. ఆయన 1992లో పైన తెలిపిన సర్వే నంబరులోని ఒక ఎకరాను అబ్దుల్ జబ్బార్‌కు, 1.55 ఎకరాను షాజిదాబీకి విక్రయించారు. ఆ తర్వాత పక్కీర్ సాహెబ్ అదే ఏడాది చనిపోయాడు. షాజిదాబీ నుంచి 2005లో రాజమోహన్‌రెడ్డి, అబ్దుల్ జబ్బార్ నుంచి 2008లో పాశ్యం గోపాల్ రావు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ పొందారు. ఆ తర్వాత వీరు వాటిని ప్లాట్లుగా చేయగా, దాదాపు 37 మంది వరకు సామాన్యులు పైసా పైసా కూడబెట్టుకుని ఈ సర్వే నంబరులోని స్థలాలను కొనుగోలు చేశారు. అయితే నంద్యాలలో రోజురోజుకు స్థలాల ధరలు పెరుగుతుండటంతో ఈ భూములకు విపరీతంగా డిమాండు వచ్చింది. దీనిపై కొందరి అక్రమార్కుల కన్ను పడింది. 2019లో వైసీపీ ప్రభుత్వం రాగానే ఆ పార్టీ అండ చూసుకుని ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు పథకం వేశారు. సర్వే నంబరు 2323/9లోని 2.55 ఎకరాలు తమ భూమి అని తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి, అసలు స్థల యజమానులను భయభ్రాంతులకు గురిచేశారు.

నాలుగేళ్లుగా నాన్చుతూ..

బాధితుల ఫిర్యాదు మేరకు తప్పుడు రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వారితో పాటు, రామ్మోహన్‌రెడ్డిపైన బీఎన్ఎస్ సెక్షన్లు 420, 468, 120 రెడ్‌విత్ 34 కింద 2020 ఫిబ్రవరి 2న స్థానిక టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితులు 2326/9 భూమి తమదే అనడానికి అవసరమైన అన్ని రకాల పత్రాలు, అసలు పక్కీర్ సాహెబ్ 1992లో చనిపోయినట్లు చూపించే మరణ ధ్రువీకరణ పత్రం, అలాగే నకిలీ పక్కీర్ సాహెబ్ 1972 చనిపోయినట్లు చూపించే మరణ ధ్రువీకరణ పత్రం వంటివి చూపించి ఈ భూమిపై 2019లో జరిగిన రిజిస్ట్రేషన్ చెల్లదంటూ జిల్లా రిజిస్ట్రార్‌కు మొరపెట్టుకున్నారు. దీంతో అప్పటి జిల్లా రిజిస్ట్రార్ అసలు యజమానులు 2008 నుంచి క్రయం పొందిన 37 మాత్రమేనని, 2019లో నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిది చెల్లదని, ఈ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని, అలాగే దొంగ పత్రాలతో మోసం చేసేందుకు చూసిన ఎనిమిది మందిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. ఇక 1992లో చనిపోయిన పక్కీర్ సాహెబ్ మరణ ధ్రువీకరణ పత్రం 'జెన్యూన్'ది గాను, ఇక నకిలీ పక్కీర్ సాహెబ్ 1972లో చనిపోగా, ఆయన మరణాన్ని 2012లో రిజిస్టర్ చేశారని నంద్యాల మున్సిపాలిటీ ధ్రువీకరణపత్రం ఇచ్చింది. ఇలా అన్ని వేళ్లు సర్వే నంబరు 2326/9 భూమిని 2019లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారి వైపే చూపుతున్నా వారిని అరెస్టు చేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారన్నది పోలీసులకే తెలియాలి.



అక్రమార్కులపై 2020లో కేసు నమోదైనట్లు చూపుతున్న ఎఫ్ఐఆర్ కాపీ

వైసీపీ అండతోనే..?

ఎస్‌బీఐ కాలనీలో ప్రస్తుతం ఒక సెంటు విలువ దాదాపు రూ.8 నుంచి రూ.10 లక్షలు పలుకుతోంది. ఈ లెక్కన సర్వే నంబరు 2326/9లోని 2.55 ఎకరాల భూమి ప్రస్తుత విలువ రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్లు ఉంటుంది. దీనిని ఎలాగైనా కాజేయాలని కుట్రపన్నారు. ఇందుకు అన్ని దొంగ పత్రాలు సృష్టించి స్థలాన్ని తమ పేరు మీదకు మార్చుకున్నారు. అయితే అసలు యజమానులు ఈ భూమి తమదేనంటూ పత్రాలు చూపించటంతో పోలీసులు కేసు నమోదు చేసినా నిందితులను మాత్రం అరెస్టు చేయలేదు. ఆ తర్వాత కేసు విషయం అప్పటి ఎస్పీ రఘువీర్‌రెడ్డి చుట్టూ బాధితులు తిరిగినా అదిగో, ఇదిగో అంటూ చర్యలు తీసుకోకుండా నాన్చారు. నిందితుల్లో ఒకరు వైసీపీ నాయకుడిగా ఉండటం, ఆయన తన పలుకుబడిని ఉపయోగించుకుని కేసును పెండింగ్ పెట్టించగలిగాడు. దీనికి తోడు భూమి తమదేనంటూ సివిల్ కోర్టులో కేసు వేసి, దానిని వాయిదాల వాయిదా వేయిస్తూ హియరింగ్‌కు రాకుండా చేయగలుగుతున్నారని బాధితులు ఆవేదన చెందుతున్నారు.

భారీ స్కెచ్

సర్వే నంబరు 2326/9 లోని 2.55 ఎకరాలకు అసలు యజమాని సిద్ధిబిరాం పక్కీర్ సాహెబ్. అయితే ఇదే పేరుతో ఉన్న నంద్యాల మండలం అయ్యలూరుకి చెందిన వ్యక్తి కుమారుడు సిద్ధిబిరాం షేక్ సాహెబ్‌ను తెరమీదకు తీసుకువచ్చారు. సిద్ధిబిరాం చనిపోయాడని, ఆస్తికి వారసుడు షేక్ సాహెబ్ అని నమ్మించి అతని ద్వారా ఎస్‌బీఐ కాలనీలోని భూమిని 2019 నవంబరులో బూచేపల్లి ఉమామహేశ్వరి, భూమా సందీప్ కుమార్‌రెడ్డి, భూమా సంతోష్ కుమార్‌రెడ్డి, భూమా విజయలక్ష్మీ, దేశం చంద్రశేఖర్, ఏర్వ ప్రసాద్‌రెడ్డి, పగిడాల నాగేశ్వరయ్య తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అయితే ఇక్కడే అసలు తిరకాసు ఉంది. నిజాలను బయటపెట్టే వాస్తవాలు దాగి ఉన్నాయి. సర్వే నంబరు 2326/9లోని 2.55 ఎకరాల భూమికి అసలు యజమాని అయిన పక్కీర్ సాహెబ్ నంద్యాలలోని మసీద్ ఏ బిలాల్‌కు రెండు సెంట్ల భూమిని 1987లో దానంగా ఇచ్చాడు. ఇందుకు సంబంధించిన దస్తావేజుల్లో తనకు ఎలాంటి సంతానం లేదని, తనతో పాటు తన భార్య ఈ భూమిని ఇష్టపూర్వకంగానే దానం ఇస్తున్నట్లు స్పష్టంగా తెలిపారు. ఆ తర్వాత 1992లో ఇదే సర్వే నంబరులోని భూమిని అబ్దుల్ జబ్బార్‌కు, షాజిదాబీకి విక్రయించారు. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్ కాగితాలు కూడా ఉన్నాయి. అయితే కబ్జాదారులు పక్కీర్ సాహెబ్ అని చూపుతున్న వ్యక్తి 1972లో చనిపోయాడు. ఆయన మరణాన్ని 2012లో మున్సిపాలిటీలో నమోదు చేశారు. 1972లో చనిపోయిన వ్యక్తి 1992లో రిజిస్ట్రేషన్ చేసే అవకాశం లేదు. పైగా అసలు ఫక్కీర్ సాహెబ్‌కు కొడుకులు లేనపుడు వారసులు ఎక్కడి నుంచి వచ్చారన్నది ప్రశ్న. దీంతో ఇవన్నీ కబ్జాదారులు చేస్తున్న మోసాలని, నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్‌కు పాల్పడ్డారంటూ అప్పట్లోనే సబ్ రిజిస్ట్రార్‌కు చెప్పినా పట్టించుకోకుండా కబ్జాదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ తతంగం వెనుక నంద్యాలకు చెందిన రియల్టర్ రామ్మోహన్ రెడ్డి ఉన్నారంటూ ఈ సర్వే నంబరులోని అసలు యజమానులు ఆరోపిస్తూ పోలీసులను ఆశ్రయించారు.

మాకు న్యాయం చేయండి




ఎస్‌బీఐ కాలనీలోని సర్వే నంబరు 2326/9లో మేము ప్లాటు కొనుగోలు చేశాం. వాటిపై తప్పుడు పత్రాలు సృష్టించి కొంతమంది అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. అవి మా భూములు అని చూపించేందుకు అవసరమైన అన్ని పత్రాలు మా వద్ద ఉన్నాయి. దీనిపై కేసు నమోదై నాలుగేళ్ల అవుతున్నా పోలీసులు నిందితులను అరెస్టు చేయలేదు. మాకు తగిన న్యాయం చేసి మా భూములను మాకు అప్పగించండి.

-మాబాషా, నంద్యాల.

త్వరలోనే అరెస్టు చేస్తాం

గతంలో నమోదైన కేసును పరిశీలించాం. ఇప్పటికే నకిలీ పక్కీర్ సాహెబ్ వారసుల్లో ఒకరిని స్టేషనుకు పిలిపించాం. మిగిలిన నిందితులను కూడా త్వరలోనే అరెస్టు చేస్తాం. బాధితులకు న్యాయం చేస్తాం.

-ఇస్మాయిల్, టూ టౌన్ సీఐ, నంద్యాల.



అసలు సిద్దిబిరాం పక్కీర్ సాహెబ్ 1992 మరణించినట్లు చూపుతున్న మరణ ధ్రువీకరణ పత్రం

మా సొంత భూముల కోసం ఎన్నాళ్లు తిరగాలి



ఎస్‌బీఐ కాలనీలోని సర్వే నంబరు 2326/9లోని భూమిలో మేము 11 ఏళ్లుగా అనుభవంలో ఉన్నాం. కానీ కొంతమంది అక్రమార్కులు 2019లో తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. మావద్ద ఉన్న అన్ని పత్రాలను పరిశీలించిన తర్వాత 2019లో అక్రమార్కులు చేయించుకున్న రిజిస్ట్రేషన్లు చెల్లవని, ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని జిల్లా రిజిస్ట్రార్ ఉత్తర్వులు ఇచ్చారు. అక్రమార్కులకు వైసీపీ అండ ఉండటంతో నాలుగేళ్లుగా మాకు న్యాయం జరగలేదు. కూటమి ప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్నాం. ప్రస్తుత ప్రభుత్వంలో అయినా మాకు మేలు జరుగుతుందని ఆశిస్తున్నాం.

-సుధీంద్ర కుమార్, నంద్యాల

దసరా మహోత్సవాలకు ఆహ్వానం



రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తున్న దేవదాయశాఖ మంత్రి, కమిషనర్

శ్రీశైలం, సెప్టెంబర్ 30: శ్రీశైలం మహా క్షేత్రంలో అక్టోబరు 3 నుంచి 12 వరకు జరిగే దసరా మహోత్సవాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయ కమిషనర్ ఎస్. సత్యనారాయణ, శ్రీశైలం ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజులు ఆహ్వానించారు. మానవ వనరుల శాఖ అభివృద్ధి, ఐటీ కమ్యూనికేషన్ల శాఖ మంత్రి నారా లోకేశ్, దేవదాయవాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణను ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు, అర్చకులు, వేదపండితులు దసరా మహోత్సవాలకు ఆహ్వానించారు. శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి టీజీ భరత్, రాష్ట్ర నాయ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అధిరాజ్ సింగ్, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్‌కు ఆలయ అధికారులు ఆహ్వానం పలికారు.

పింఛన్ల పంపిణీపై జాగ్రత్తలు తీసుకోండి

కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జేసీ, సంబంధిత అధికారులు

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 30: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద పింఛన్ల పంపిణీపై అత్యంత జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు పింఛన్‌దారులందరికీ మంగళవారం సాయంత్రంలోగా వంద శాతం పంపిణీ పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ, ఉపాధ్యాయ అర్హత పరీక్ష, స్వర్ణాంధ్ర 2047, ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద జిల్లాలో 2.18 లక్షల మందికి రూ.92 కోట్లు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. మరణించిన, వలస వెళ్లిన లబ్ధిదారుల మొత్తాన్ని మూడు నెలల నుంచి తిరిగి జమ చేయలేదని, దీనికి సంబంధించిన ఫైల్‌ను తనకు పంపాలని డీఆర్డీఏ పీడీని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 8800 మంది ఉపాధ్యాయ అర్హత పరీక్షలకు హాజరవుతున్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్వర్ణాంధ్ర 2047 ప్రణాళికకు రూపకల్పనకు క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్ఓ పద్మజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 307 వినతులు

ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం ద్వారా స్వీకరించిన ప్రజా వినతులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో పద్మజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు. 307 మంది సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు అర్జీలు సమర్పించుకున్నారు.

ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో కొత్త సర్కిళ్లు

కల్లూరు, సెప్టెంబరు 30: ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్‌శాఖ నాలుగు కొత్త ఆపరేషన్ సర్కిళ్లు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో ఉండే 5 జిల్లాలను 9 జిల్లాలుగా ఏర్పడిన నేపథ్యంలో 4 నూతన సర్కిళ్లకు ఉద్యోగులను సర్దుబాటు చేస్తూ ఆశాఖ సీఎండి కె. సంతోషరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు, రాయచోటి, నంద్యాల, పుట్టపర్తి ఆపరేషన్ సర్కిళ్లకు విద్యుత్‌శాఖపై ఎలాంటి ఆర్థిక బారం పడకుండా పరిపాలనా సౌలభ్యం కోసం ఆయన పోస్టులను సర్దుబాటు చేశారు.

రూ.78.77 లక్షల కుంభకోణం

- ఆత్మకూరు కేడీసీసీ బ్యాంకులో ఉద్యోగి చేతివాటం
- నగదును మాయం చేసిన క్యాషియర్
- ఇద్దరిని సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు



ఆత్మకూరు కేడీసీసీ బ్యాంకు

ఆత్మకూరు, సెప్టెంబరు 30: కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ ఆత్మకూరు శాఖలో భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఈ బ్రాంచ్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్న అల్తాఫ్ అనే ఉద్యోగి రూ.78.77లక్షల నగదును కాజేశాడు. ఎట్టకేలకు బ్యాంకు ఉన్నతాధికారులు గుర్తించి ఆయనతో పాటు మరొక ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు కేడీసీసీ బ్యాంకులో క్యాషియర్‌గా విధులు నిర్వహిస్తున్న అల్తాఫ్ బ్యాంకు లావాదేవీల అనంతరం బ్యాలెన్స్ నగదును స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచాల్సి ఉంటుంది. అయితే గత కొన్నిరోజులుగా అల్తాఫ్ బ్యాలెన్స్ నగదును తన అవసరాలను వాడుకున్నట్లు తెలిసింది. రెండు, మూడు రోజుల క్రితం బ్యాంకు మేనేజర్ పెద్దపులి రాజు బ్యాలెన్స్ నగదును పరిశీలించగా తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. విషయాన్ని కేడీసీసీ బ్యాంకు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సోమవారం బ్యాంకు చీఫ్ మేనేజర్ సౌజన్య ఆత్మకూరు బ్రాంచ్‌కు చేరుకుని విచారణ చేపట్టారు. క్యాషియర్ అల్తాఫ్ రూ.78.77 లక్షల నగదు మాయం చేసినట్లు గుర్తించారు. కాగా క్యాషియర్ బ్యాంకు నిల్వ ఉంచిన బ్యాలెన్స్ మొత్తాన్ని పీఓ రంగయ్య బ్యాంకు లావాదేవీల అనంతరం పరిశీలించాల్సి ఉంది. అయితే ఆయన సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే బ్యాంకులో భారీగా నగదు మాయమైనట్లు స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో అక్రమాలకు పాల్పడిన క్యాషియర్ అల్తాఫ్, అలసత్వం వహించిన రంగయ్యను సస్పెండ్ చేస్తూ కేడీసీసీ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇదిలావుంటే రైతులు, పొదుపు మహిళలు, వివిధ వర్గాలకు చెందిన తమ అవసరాల నిమిత్తం రుణాల ఇవ్వాలని బ్యాంకుల చుట్టూ తిరిగితే ఖాతాదారులకు నిబంధనల పేరుతో చుక్కలు చూపించే అధికారులు బ్యాంకులో భారీ మొత్తం మాయమవుతున్నా ఇంతకాలం కనిపెట్టకపోవడంపై విమర్శలకు తావిస్తోంది. కాగా ఇదే బ్రాంచ్‌కు సంబంధించి గతంలో సుమారు రూ.3కోట్ల వరకు నాబార్డు కింద మంజూరైన నిధుల విషయంలో కూడా గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ అధికారి అర్హత లేకున్నా చాలామందికి రుణాలను చెల్లించినట్లు తెలిసింది. దీంతో ప్రస్తుతం రుణాలు రికవరీ సరిగ్గా జరగక బ్యాంకు ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. నాబార్డు రుణాల విషయంలో బ్యాంకు ఉన్నతాధికారులు విచారణ చేపడితే మరెన్నో లొసుగులు బయటపడే అవకాశం లేకపోలేదు.

సమస్యలు పునరావృతం కాకూడదు: ఎస్పీ



దివ్యాంగుడినుంచి వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న ఎస్పీ

నంద్యాల క్రైం, సెప్టెంబరు 30 : ప్రజల ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. సోమవారం నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎస్పీ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 86 ఫిర్యాదులు వచ్చాయి. పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడారు. చట్టపరిధిలోని సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని, ఫిర్యాదుదారులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని అన్నారు. సమస్య పరిష్కారం కోసం ఒక దివ్యాంగుడు రావడంతో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి ఎస్పీ నేరుగా దివ్యాంగుడి వద్దకు వచ్చి సమస్యను అడిగి తెలుసుకున్నారు. సమస్యను పరిష్కరించమని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతోపాటు ఎస్పీ సీఐలు విజయభాస్కర్, ఎలిషావలి, సైబర్ క్రైం సీఐ ప్రియతంరెడ్డి, డీసీఆర్బీ సీఐ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెల్లొల్లి

- ఆకాశాన్నంటుతున్న ధరలు
- 6 నెలలుగా అదుపులోకి రాని వైనం
- రిటైల్ మార్కెట్లో కిలో రూ.380



కొలిమిగుండ్ల, సెప్టెంబరు 30 : వెల్లుల్లి ధరలు భారీగా పెరుగుతున్నాయి. గత కొంత కాలంగా ఆకాశమే హద్దుగా చుక్కలు చూపుతున్నాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు కొనలేకపోతున్నారు. సరిగ్గా ఏడాది క్రితం కిలో రూ.50 నుంచి 100లోపు ఉన్న వెల్లుల్లి ధర ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో రూ.350 నుంచి రూ.380 వరకు పలుకుతోంది. మసాల వంటకాల్లో ప్రధాన అవసరమైన వెల్లుల్లి ధరలు ఇలా పెరగడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలలుగా వెల్లుల్లి ధరలు అదుపులోకి రాకపోవడంతో నెమ్మదిగా సామాన్యుడి వంటింటి నుంచి వెల్లుల్లి మాయమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. డిమాండ్‌కు తగ్గ దిగుబడి లేకపోవడమే ధరల పెరుగుదలకు కారణమని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.

వృద్ధులకూ హక్కులు ఉన్నాయి

- 60లోకి అడుగు పెట్టిన వారి కోసం ప్రత్యేక చట్టాలు
- ఆలనా పాలనా చూసుకునేందుకు నిరాకరిస్తే కేసులు
- ప్రభుత్వ రాయితీలతో పాటు, ఇతర సదుపాయాలు
- తెలుసుకుంటే ప్రయోజనాలెన్నో..



నంద్యాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యం సహజమైంది. కానీ సమాజంలో, కుటుంబంలో వృద్ధులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వృద్ధులకు కొన్ని హక్కులను ప్రభుత్వం కల్పించింది. ప్రతి ఏటా అక్టోబరు 1న అంతర్జాతీయంగా వృద్ధుల దినోత్సవం జరుపుకుంటారు. వృద్ధులైన తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత వారి పిల్లలకు ఉంది. హిందూ అడాప్షన్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్-1956 కింద తల్లిదండ్రులను చూడాల్సిన బాధ్యత కొడుకులే కాకుండా కూతుళ్లపైన కూడా సమానంగా ఉంటుంది. మైనారిటీ చట్టానికి వస్తే వృద్ధులైన తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత కొడుకులపైన ఉందని ముల్లా చట్టం కూడా చెబుతోంది. కుమారుడు ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా, పేదరికంతో బాధపడుతున్నా కన్నవారి ఆలనా పాలనా చూడాల్సిందే. క్రిస్టియన్, పార్శీ మతాల్లో తల్లిదండ్రుల సంక్షేమానికి ఎలాంటి చట్టాలు లేవు. వీరు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సీఆర్‌పీసీ) కింద తమ సంరక్షణ చూడాలంటూ దరఖాస్తు చేసుకోవచ్చు. 1973లో సెక్షన్ 125ను ప్రవేశపెట్టారు. సీఆర్‌పీసీ అన్నది లౌకిక చట్టం అందరికీ వర్తిస్తుంది. అన్ని మతాలు, వర్గాల వారికీ అమలవుతుంది. కుమార్తెలు(వివాహమైనా సరే) కూడా తల్లిదండ్రుల పోషణను చూడాల్సి ఉంటుంది.

తల్లిదండ్రుల నిర్వహణ, సంక్షేమ చట్టం-2007


తల్లిదండ్రుల బాధ్యత విషయంలో సంక్షేమ చట్టాన్ని భారత ప్రభుత్వం 2007లో తీసుకువచ్చింది. 60 ఏళ్ల పైబడిన వారిని వృద్ధులుగా పరిగణిస్తూ, ఈ చట్టంలోని క్లాజు 5(1), క్లాజు 4 కింద మెయింటెనెన్స్ కోరుతూ దరఖాస్తు చేసుకోవచ్చు. కేసుల సత్వర విచారణకు, మెయింటెనెన్స్‌కు ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. పిటిషన్ దాఖలు చేసుకోలేని వారి తరఫున ట్రిబ్యునల్ సుమోటోగా తీసుకుని పరిహారానికి ఆదేశించవచ్చు. తల్లిదండ్రుల బాధ్యత కలిగిన వారు ఉద్దేశపూర్వకంగా వారిని వదిలేస్తే రూ.5 వేల జరిమానా లేదా మూడు నెలల పాటు జైలు శిక్ష లేదా రెండూ విధించే అవకాశం ఉంది.

ఆదాయపు పన్ను, ప్రయాణ రాయితీలు

సీనియర్ సిటిజన్లకు మెయింటెనెన్స్ బాధ్యతే కాకుండా భారత ప్రభుత్వం ఆదాయపు పన్ను, ప్రయాణ రాయితీలు ఇస్తోంది. సాధారణంగా రూ.2.5 లక్షల ఆదాయానికి పన్ను ఉండదు కానీ సీనియర్ సిటిజన్లకు రూ.3 లక్షల వరకు మినహాయింపు ఉంటుంది. అదే 80 ఏళ్ల దాటిన వారికి రూ.5 లక్షల వరకు పన్ను లేదు. ఆరోగ్య బీమా చెల్లించే ప్రీమియం రూ.30 వరకు పన్ను మినహాయింపు ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం అందించే సదుపాయాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా వృద్ధులకు ప్రత్యేక సదుపాయాలు అందించాల్సి ఉంది.

చారిత్రక స్మృతులు

● రాష్ట్ర అవతరణకు 70 ఏళ్లు పూర్తి ● తొలి రాజధానిగా కర్నూలు
● టెంటెడ్ క్యాపిటల్‌గా పరిపాలన



రాష్ట్ర అవతరణ వేడుకలకు విచ్చేసిన నాటి ప్రధాని నెహ్రూ

కర్నూలు (కల్చరల్) : సెప్టెంబరు 30:

తెలుగు భాష మాట్లాడేవారు ఒక రాష్ట్రం ఉండాలని ఆకాంక్షతో అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేయడంతో ఆనాటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్రరాష్ట్రం వేరుపడింది. దేశంలో మొదటి భాషాప్రయుక్త రాష్ట్రంగా 1953 అక్టోబరు 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. స్వాతంత్ర సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా పాలన ప్రారంభించారు. 1953 అక్టోబరు 2న నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ దక్షిణ భారత జాతీయ నాయకులతో కలిసి వచ్చిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో పాల్గొన్నారు. నగర నడిబొడ్డున ఉన్న ఎస్టీబీసీ కళాశాల క్రీడామైదానం అందుకు వేదికగా నిలిచింది. ప్రకాశం పంతులు సోదరుని కుమార్తె టంగుటూరి సూర్యకుమారి 'మాతెలుగు తల్లికి...మల్లెపూదండ...' అంటూ పాటపాడారు. అలా కర్నూలు తొలి భాషా ప్రయుక్త రాష్ట్ర రాజధానిగా జాతీయ పటంలో చోటు చేసుకుంది. ఆనాటి రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమానికి ఎందరో జాతీయ నాయకులు వచ్చారు. నేటితో ఆంధ్ర రాష్ట్ర అవతరణకు 70 ఏళ్లు పూర్తయ్యాయి.

1953లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయాక రాష్ట్ర రాజధానిని కర్నూలులో 40 రోజుల్లో నిర్మించారు. అప్పటి స్పెషల్ కలెక్టర్ సి. నరసింహం, కలెక్టర్ వీవీ మాధవరావు, ఎస్పీ బి. కల్యాణరావు, చీఫ్ ఇంజనీర్ ఫ్రెడరిక్, ఎస్ఈ కాయిల్ పిళ్లై నేతృత్వంలో ప్రత్యేక అధికారుల బృందం అత్యంత కష్టతరమైన పనిని స్వల్ప కాలంలో పూర్తి చేశారు. చీఫ్ సెక్రటరీ ఒ. పుల్లారెడ్డి మద్రాసు నుంచి రాజధాని తరలింపు కార్యకలాపాలను పర్యవేక్షించారు.

● గుడారాల రాజధానిగా...

40 రోజుల్లో కర్నూలు రాజధానికి రూపకల్పన చేసిన స్పెషల్ కలెక్టర్ చల్లగల్ల నరసింహం, చర్చల అనంతరం రాష్ట్ర కార్యాలయాలకు అనువుగా ఉన్న అన్ని జిల్లా కార్యాలయాలను మూడు నుంచి ఐదు రోజుల్లో ఖాళీ చేసి నంద్యాల, బనగానపల్లికి తరలించాలని అధికారులకు ఆదేశించారు. ఒక్కరోజులోనే ప్రత్యేక కలెక్టర్ బృందం భూ యజమానులతో సమావేశం నిర్వహించి పంట నష్టానికి ఎకరాకు రూ.150 పరిహారంగా నిర్ణయించారు. దుమ్ము రహిత రోడ్లు, నీటి సరఫరా, మరుగుదొడ్లను నిర్మించిన తర్వాత లేఅవుట్‌లో 600 మిలిటరీ టెంట్లు వేసింది. ప్రభుత్వం మిలిటరీ స్టోర్స్‌కు టెంట్స్ కోసం ఉత్తర్వులు ఇచ్చింది. వాటిని పూణే నుంచి సేకరించింది. టెంట్లు వేయడానికి 200 మంది మలబార్ కార్మికులతో కూడిన బృందాన్ని నియమించారు. ఆ కారణంగానే కర్నూలుకు 'గుడారాల రాజధాని'గా పేరు వచ్చింది. వీఐపీలకు వసతి కల్పించేందుకు తుంగభద్ర ఇండస్ట్రీస్ వసతి గృహంలో ఒక గదిని, రైల్వే స్టేషన్‌లో ఒక విశ్రాంతి గదిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అక్టోబరు 2న ప్రారంభోత్సవ కార్యక్రమానికి మద్రాసు నుంచి ఉద్యోగులను, ఫర్నీచర్, రికార్డులు తరలించడానికి ఒక ప్రత్యేక రైలు నడిపారు.

నగరంలో ప్రభుత్వ కార్యాలయాలుగా రూపుదిద్దుకున్న భవనాలు ఇవే...

ం ప్రస్తుత జిల్లా కోర్టు - రాష్ట్ర అసెంబ్లీ భవనం, ప్రస్తుత కేవీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల - రాజ్‌భవన్ (గవర్నర్ బంగ్లా), కర్నూలు వైద్య కళాశాలలోని ఫోరెన్సిక్ భవనం - రాష్ట్ర సచివాలయం, ఎస్టీబీసీ కళాశాల భవనం - ముఖ్యమంత్రి కార్యాలయం, ఎస్టీబీసీ కళాశాల పక్కనగల మిషనరీ భవనం - ముఖ్యమంత్రి నివాసం, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం - స్పీకర్ నివాసం, జడ్పీ భవనం, కలెక్టర్ బంగ్లా - స్థానిక పరిపాలన, సచివాలయం, కలెక్టర్ భవనం - ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయం, ఎస్పీ కార్యాలయం - రాష్ట్ర ఐజీ కార్యాలయం, ఎక్సైజ్ శాఖ కార్యాలయం - ఏపీపీఎస్‌సీ కార్యాలయం, టౌన్ మోడల్ హైస్కూలు, ప్రస్తుత మెడికల్ కళాశాల హాస్టల్ గదులు - ఎమ్మెల్యే క్వార్టర్లు.



పరిపాలన కోసం ఆనాడు నిర్మించిన గుడారాలు (ఫైల్)



వేడుకలకు హాజరైన నాటి భారత ఉప రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ (ఫైల్)

తొలి రాష్ట్ర ప్రభుత్వ ముఖచిత్రం ఇలా...

గవర్నర్ : సీఎం త్రివేది, ముఖ్యమంత్రి : టంగుటూరి ప్రకాశం పంతులు, స్పీకర్: నల్లపాటి వెంకటరామయ్య, డిప్యూటీ స్పీకర్: పసల సూర్యచంద్రరావు, ఉప ముఖ్యమంత్రి: నీలం సంజీవరెడ్డి, ఆర్థిక శాఖ : తెన్నేటి విశ్వనాథం, సాంఘిక సంక్షేమం: దామోదరం సంజీవయ్య, విద్యాశాఖ: పట్టాభి రామారావు, ఆరోగ్యశాఖ : కళా వెంకటరావు, పురపాలక శాఖ : కల్లూరి చంద్రమౌళి, విద్యుత్తు : సర్దార్ గౌతు లచ్చన్న, రెవెన్యూ : కె. కోటిరెడ్డి, ప్రతిపక్ష నాయకుడు : పుచ్చలపల్లి సుందరయ్య, చీఫ్ సెక్రటరీ : ఒ. పుల్లారెడ్డి పనిచేశారు.

● మొదటి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు 1-10-1953 నుంచి 15-11-1954 వరకు పనిచేశారు. అవిశ్వాస తీర్మానంతో ఆయన దిగిపోయారు. తర్వాత 15-11-1954 నుంచీ 28-03-1955 వరకు దక్షిణ భారత చరిత్రలో తొలిసారి రాష్ట్రపతి పాలన విధించారు. గవర్నర్ త్రివేది రాజ్‌భవన్ నుంచి పాలన సాగించారు. 1955లో మధ్యంతర ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి రెండో ముఖ్యమంత్రిగా బెజవాడ గోపాల్‌రెడ్డి పనిచేశారు. ఆయన 28-03-1955 నుంచి 31-10-1956 పదవిలో ఉన్నారు. అనంతరం ఆంధ్రరాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌గా అవతరించి, రాజధాని కర్నూలు నుంచి హైదరాబాదుకు తరలి వెళ్లిపోయింది.

వక్ఫ్ బోర్డు పునర్ వ్యవస్థీకరణపై పార్లమెంటరీ కమిటీ

● మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 30: వక్ఫ్ బోర్డు పునర్ వ్యవస్థీకరణపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేసిందని, ఇందులో చంద్రబాబు కృషి అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ, అడ్వయిజరీ కమిటీ సభ్యుడు ఇక్బాల్ హమ్మద్ అన్నారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ముస్లిం మత పెద్దలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియలో దేశ వ్యాప్తంగా ముస్లింల అభిప్రాయాలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారని తెలిపారు. ముస్లిం సామాజిక వర్గాలకు అర్థం అయ్యేలా పార్లమెంటరీ జాయింట్ కమిటీ నివేదికను రూపొందిస్తుందని, ఈ చట్టం వల్ల ముస్లింలకు ఎటాంటి ఇబ్బందులు ఉండవని భరోసా ఇచ్చారు.

జగన్‌కు మద్దతు తెలిపితే నాశనమే

కొడాలి, పేర్ని నోరు అదుపులో పెట్టుకోవాలి : సోమిశెట్టి ఫైర్



కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 30: తిరుమల లడ్డూను కల్తీ చేసిన జగన్‌కు మద్దతు తెలిపిన వారందరూ నాశనమై పోతారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి మండిపడ్డారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. లడ్డూ అపచారానికి క్షమాపణ చెప్పక పోగా విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి రోజుకో రకంగా ఆ పార్టీ నాయకులతో వ్యాఖ్యలు చేయిస్తున్నారని అన్నారు. తిరుమల వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవడానికి వెళ్లాలని నిర్ణయించుకున్న జగన్ టీటీడీ నియమ నిబంధనల మేరకు డిక్లరేషన్ ఇవ్వవలసి ఉండగా అది ఇష్టం లేని జగన్ రెడ్డి తన పర్యటనను రద్దు చేసుకున్నారని తెలిపారు.

విమానాశ్రయంలో ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, అధికారులు

ఓర్వకల్లు, సెప్టెంబరు 30: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో ఓర్వకల్లు విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లను సోమవారం కలెక్టర్ పి. రంజిత్ బాషా పరిశీలించారు. ప్రొటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లను చూసుకోవాలని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, కర్నూలు ఆర్డీవోను ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, తహసీల్దార్ విద్యాసాగర్, ఎస్ఐ సునీల్ కుమార్ ఉన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు భారీ బందోబస్తు

800 మంది పోలీసులతో నిఘా ఏర్పాట్లు

కర్నూలు, సెప్టెంబరు 30: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనకు 800 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి పర్యటించే రూట్ అండ్ రూఫ్-టాప్ ప్రాంతాల్లో సీఎం కాన్వాయ్, హెలిపాడ్, సభా సమావేశ ప్రాంగణం, తదితర ప్రాంతాల్లో బందోబస్తు విధులు నిర్వహించే మఫ్టీ పోలీసులు, స్పెషల్‌పార్టీ పోలీసు బృందాలు, పోలీసు జాగిలాలు, బాంబ్ స్క్వాడ్ బృందాలతో పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ బందోబస్తులో ఐదుగురు డీఎస్పీలు, 38 మంది సీఐలు, 40 మంది ఎస్ఐలు, 160 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 213 మంది కానిస్టేబుళ్లు, 24 మంది మహిళా పోలీసులు, 106 మంది హోంగార్డులు, ముగ్గురు సెక్షన్ల ఏఆర్ సిబ్బందితోపాటు ఐదు స్పెషల్ పార్టీ బృందాలు బందోబస్తు విధుల్లో పాల్గొంటాయి.

జిల్లా ఫార్మసిస్టు అసోసియేషన్ ఏర్పాటు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 30: నగరంలోని పద్మావతినగర్ ఫార్మసీ అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా ఫార్మసిస్టు అసోసియేషన్ ఆఫ్ ఏపీ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి అసోసియేషన్ రాయలసీమ జోన్ కోఆర్డినేటర్ షేక్ ఇర్ఫాన్ అధ్యక్షత వహించారు. అనంతరం జిల్లా ప్రెసిడెంటుగా ఎం.జిలానీబాషా, వైస్ ప్రెసిడెంటుగా వై.రాజేష్, సెక్రటరీ షేక్ ఖాదర్‌బాషా, అడ్వైజర్‌గా పఠాన్, ఇర్షాద్ ఖాన్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు మారెన్న, పఠాన్ నిషాద్ ఖాన్, ప్రణీత్, మణికంట, ఇసాక్, వినోద్‌లు ఎన్నికయ్యారు.

కర్నూలు యార్డుకు భారీగా ఉల్లి

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 30: కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం ఉల్లిని రైతులు విక్రయానికి తీసుకు వచ్చారు. దాదాపు 28,024 బస్తాలు (12,611 క్వింటాళ్లు) వచ్చినందున మార్కెట్ యార్డులోని ఉల్లి గోదాములు, షెడ్లు, మాధవాచారి షెడ్లు కూడా పూర్తిగా నిండిపోయాయని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. ఉల్లిగడ్డలను లారీల ద్వారా బయటకు పంపేందుకు ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉండటం వల్ల 1వ తేదీన ఉల్లిగడ్డలు మార్కెట్ యార్డుకు తీసుకురావద్దని, ఈ విషయంలో రైతులకు కమిషన్ ఏజెంట్లు వెంటనే సమాచారం అందించాలని సెక్రటరీ జయలక్ష్మి విజ్ఞప్తి చేశారు.

నామినేటెడ్ వరించేనా..?

● ఆశావహుల్లో టెన్షన్.. టెన్షన్
● స్టేట్ పదవి రేసులో తుగ్గలి నాగేంద్ర
● కేడీసీసీ వైపు సాంబశివారెడ్డి చూపు



పత్తికొండ, సెప్టెంబరు 30 : పార్టీ కోసం కష్టపడిన నాయకులకు నామినేటెడ్ పదవులు కట్టబెట్టేందుకు అధిష్ఠానం సిద్ధమైంది. అందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల ఇన్‌చార్జిల నుంచి రాష్ట్ర పార్టీ కార్యాలయం వివరాలను సేకరించినట్లు తెలుస్తోంది. దీంతో ఆశావహుల్లో టెన్షన్ మొదలైంది. కొందరు నాయకులైతే ఇప్పటికే అధిష్ఠానాన్ని కలిసి తమ మనసులో కోరికను చెప్పుకోవడంతోపాటు పదవి పొందేందుకు అవసరమైన దారులు వెతుక్కుంటున్నారు. పార్టీ తమను గుర్తిస్తుందా.. తాము ఆశించిన నామినేటెడ్ పదవి వరిస్తుందా లేదా అని తర్జనభర్జనకు గురవుతున్నారు. అయితే కర్నూలు జిల్లాలోనే అత్యధికంగా సీనియర్ నాయకులు పత్తికొండ నియోజకవర్గం నుంచి నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నట్లు సమాచారం.

కార్పొరేషన్ చైర్మన్ పదవి రేసులో తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి గ్రామానికి చెందిన తుగ్గలి నాగేంద్ర ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఆయన తండ్రి టీడీపీ అభివృద్ధి కోసం పని చేస్తూ ప్రత్యర్థుల చేతితో హత్యకు గురికావడంతో ఆయన వారసత్వాన్ని తీసుకుని తుగ్గలి మండలంలో టీడీపీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ప్రత్యర్థులకు దీటుగా నిలబడి కేఈ శ్యాంబాబు గెలుపునకు కృషి చేశారు. అధినేత చంద్రబాబు కుటుంబంతో నేరుగా పరిచయాలు కలిగిన ఆయన రాజకీయంగా తనకంటూ గుర్తింపును తెచ్చుకున్నారు. సామాజిక కార్యక్రమాలో భాగంగా ఏటా వందల సంఖ్యలో ఉచిత సామూహిక వివాహాలు నిర్వహించడంతోపాటు గ్రామంలో సొంతంగా కొనుగోలు చేసిన పొలంలో 800 మంది నిరుపేదలకు ఉచితంగా ఇంటి స్థలాలను పంచిపెట్టారు. గ్రామంలోని అన్ని ప్రభుత్వ భవనాలకు ఉచితంగా స్థలాలను ఇచ్చారు. 2009 ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసిన కేఈ ప్రభాకర్ పక్షాన నిలిచి పార్టీ గెలుపునకు కృషి చేశారు. 2014 కేఈ క్రిష్ణమూర్తి, 2024లో కేఈ శ్యాంబాబు గెలుపునకు ఆయన పని చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పదవి పొందారు. ఈసారి కూడా నామినేటెడ్ పదవిని ఆశిస్తూ స్థానిక ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుతో పాటు అధినేత చంద్రబాబునాయుడును కలిసి తన మనస్సులో మాటను చెప్పుకున్నారు. ఈ మేరకు అధినేత నుంచి హామీ కూడా తీసుకున్నారు. అధినేత చంద్రబాబునాయుడు స్వయంగా మంచి పదవి ఇస్తానని హామీ ఇచ్చారని ఆయన చెబుతున్నారు. అధినేత ఇచ్చిన మాట ప్రకారం తనకు ఆశించిన నామినేటెడ్ పదవి వస్తుందన్న ఆశాభావాన్ని ఆయనతోపాటు కుటుంబ సభ్యులు వ్యక్తం చేస్తున్నారు.

కేడీసీసీ చైర్మన్ పదవి వైపు సాంబశివారెడ్డి చూపు



కేఈ కుటుంబానికి అప్పుడిగా, ఆ కుటుంబం నుంచి ముగ్గురు ఎమ్మెల్యేల గెలుపునకు సూత్రధారిగా పేరుగాంచిన సీనియర్ నాయకుడు కె.సాంబశివారెడ్డి కేడీసీసీ చైర్మన్ పదవి ఆశిస్తున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఆయన 2009 ఎన్నికల్లో తన ప్రత్యర్థి వర్గం ఎస్వీ కుటుంబం పార్టీలోకి రావడంతో కాంగ్రెస్‌ను వీడి టీడీపీలో చేరారు. టీడీపీ తరఫున బరిలో నిలిచిన కేఈ ప్రభాకర్ గెలుపునకు అండగా నిలిచారు. ఆ తర్వాత కేఈ క్రిష్ణమూర్తి గెలుపు కోసం కృషి చేశారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే తన కుటుంబ సభ్యులపై తప్పుడు కేసులు నమోదు చేసినా వారి అరాచకాలకు ఎదురు నిలిచారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో స్థానికంగా పార్టీ నాయకులకు అండగా నిలిచి వారికి ధైర్యం ఇస్తూ 2024 ఎన్నికల్లో కేఈ శ్యాంబాబు గెలుపు కోసం పని చేశారు. ఈయన కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. ఆయన స్వగ్రామం పుచ్చకాయలమడకు ముఖ్యమంత్రి వస్తున్న నేపథ్యంలో ఆయన హామీ కోసం ఎదురు చూస్తున్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 30: జాబ్‌మేళా ద్వారా నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య అన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం నైపుణ్యం, అభివృద్ధి శిక్షణ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఉద్యోగ మేళా పోస్టర్లను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నైపుణ్యం అభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అక్టోబరు 4వ తేదీన ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. 17 ప్రైవేటు కంపెనీలలో 950 ఖాళీలు ఉన్నాయని, 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాలలోపు వారు పాల్గొనాని సూచించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ చదివిన వారు ఉపాధి పొందే అవకాశాలు ఉంటాయని తెలిపారు. ముందుగా Https://skilluniverse.apssdc.in లింక్‌లో వివరాలు నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. నైపుణ్యం అభివృద్ధి, శిక్షణ అధికారి ఎల్.ఆనంద్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ సందేహాలపై 7799494856, 9642735717 నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లార్తి ఉరుసు



గంధం తీసుకొస్తున్న దర్గా పీఠాధిపతి ఖాజ మొయినుద్దీన్ ఖాద్రీ బాబా

హొళగుంద, సెప్టెంబరు 30 : జిల్లాలో ఎంతో ప్రాధాన్యత ఉన్న ఎల్లార్తి దర్గా శేక్షావలి, షాషావలి సాహెబ్‌ల ఉరుసు ఉత్సవాలు ఆదివారం అర్ధరాత్రి ఘనంగా నిర్వహించారు. దర్గా మాజీ ధర్మకర్త రాహూఫ్ సాబ్ ఇంటి నుండి రాయచూరుకు చెందిన దర్గా పీఠాధిపతి ఖాజా మొయినుద్దీన్ ఖాద్రి బాబా గంధం తలపై పెట్టుకుని మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ శేక్షావలి షాషావలి సాహెబ్‌ల సమాధులపై గంధం పూసి, పూల చాందిని సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు ఆంధ్ర నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ మహారాష్ట్ర నుండి భక్తులు వేల సంఖ్యలో వచ్చారు. భక్తులకు పంచాయితీ అధికారులు సౌకర్యాలు కల్పించారు. ఆలూరు సీఐ శ్రీనివాసులు నాయక్ ఆధ్వర్యంలో ఎస్ఐలు బాల నరసింహులు, చంద్ర, రమేష్, నరసింహులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎల్లెల్సీలో మునిగి యువకుడి మృతి

ఎమ్మిగనూరు, సెప్టెంబరు30: ఎమ్మిగనూరు పట్టణ సమీపంలోని ఎల్లెల్సీలో మునిగి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం జరిగింది. పట్టణంలోని చాకలి వీధిలో నివాసం ఉంటున్న మదర్‌సా కుమారుడు కటికె హుసేని(23) మరో ఇద్దరు కలిసి ఎల్లెల్సీలో ఈత కొట్టేందుకు వెళ్లారు. హుసేన్ ఈత కొడుతుండగా ఉన్నట్టుండి ఫిట్స్ రావడంతో నీటిలో మునిగిపోయాడు. మిత్రులు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ హుసేనీ కొట్టుకుపోయాడు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు.

స్వల్పంగా పెరిగిన పత్తి ధర

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 30 : ఆదోని వ్యవ సాయ మార్కెట్ యార్డులో పత్తి ధర సోమవారం స్వల్పంగా పెరి గింది. పత్తి ధర క్వింటాలు గరిష్ఠంగా రూ.7677 పలికింది. గత వారంతో రోజులతో పోల్చితే క్వింటానికి రూ.150 పెరిగింది. ఖరీఫ్ సీజన్ సాగైన పత్తి రైతులు మొదటి కోతకు రావడంతో విక్రయానికి తీసుకొస్తున్నారు. ధరలు పతనం కావడంతో చాలా మంది రైతులు విక్రయానికి వెనుకంజ వేస్తున్నారు. పత్తిలో తేమ శాతం అధికంగా ఉండడం వల్ల ధరలు తగ్గడానికి కారణమని రైతులు బాగా ఆరబెట్టుకుని వస్తే గిట్టుబాటు ధర లభిస్తుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. 8,203 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.4,469, గరిష్ఠ ధర రూ.7,677, మధ్యస్థ ధర రూ.7,496 పలికింది.

కర్నూలులో పిచ్చికుక్క స్వైర విహారం...!

● బాధితులను పరామర్శించిన మంత్రి టీజీ భరత్, కలెక్టర్



ఆసుపత్రిలో పరామర్శిస్తున్న మంత్రి భరత్, కలెక్టర్

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 30: కర్నూలు నగరం వన్‌టౌన్, గడ్డావీధి ప్రాంతాల్లో సోమవారం రాత్రి పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. కాలనీలో పరుగులు పెడుతూ జనంపై దాడి చేసింది. కనిపించిన వారిని కనిపించినట్లే దాడి చేసి కరిచింది. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 40 మందికి పైగా చిన్నారులపై దాడి చేసి కరవడంతో తీవ్రరక్తస్రావంతో చిన్నారులతో తల్లిదండ్రులు రాత్రి 9:30 గంటల సమయంలో కర్నూలు సర్వజన వైద్యశాలకు పరుగులు తీశారు. కుక్క కాటు బాధితులు, వారి తల్లిదండ్రులతో ఆసుపత్రి నిండిపోయింది. విషయం తెలియగానే రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డిని అప్రమత్తం చేసి బాధితులకు మెరుగైన వైద్యం అందించేలా ఏర్పాట్లు చేశారు. తక్షణమే జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాతో కలిసి హాస్పిటల్‌కు వెళ్లి బాధితులను పరామర్శించారు. వైద్యులను అడిగి పరిస్థితి తెలుసుకున్నారు. బాధితులకు కర్నూలు జీజీహెచ్ క్యాజువాల్టీలో ఏఆర్‌వీ ఇంజెక్షన్, టీటీ, ఇమ్యునోగ్లోబిన్ టీకాలు వేసి ప్రథమ చికిత్స చేశారు. అలాగే చిన్న పిల్లల వార్డుల్లో చిన్నారులకు కూడా టీకాలు వేశారు. మెరుగైన చికిత్స అందించాలని మంత్రి సూచించారు. అదే విధంగా ఆ ప్రాంతంలో పిచ్చికుక్కలు పట్టుకునేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కాగా పిచ్చికుక్క చిన్నారులను కరవడంపై మంత్రి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విషయాల పట్ల అధికారులు వెంటనే స్పందించాలని మంత్రి సూచించారు. 40 మందికి పైగా పిచ్చికుక్క కాటుకు గురైతే.. వారిలో అత్యధికులు పదేళ్లలోపు చిన్నారులు ఉన్నారు. ఈ కుక్కను పట్టుకోవడానికి మున్సిపల్ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. బాధితులకు మంత్రి టీజీ భరత్ రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. ఈయన వెంట నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు ఉన్నారు.



బాధిత చిన్నారులు బంధువులు

నంద్యాలలో యువకుడి హత్య

● వివాహేతర సంబంధమే కారణం

● పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు

నంద్యాల క్రైం, సెప్టెంబరు 30 : నంద్యాలలోని గుడిపాటిగడ్డలో ఆదివారం అర్ధరాత్రి సాయి మనోహర్ (28) అనే యువకుడు హత్యకు గురయ్యాడు. వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి వివరాల మేరకు.. ఉప్పరిపేటకు చెందిన సాయిమనోహర్ గుడిపాటిగడ్డలోని ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. గుడిపాటిగడ్డకు చెందిన ఆ మహిళ భర్త దుర్గాప్రసాద్ వీరి ప్రవర్తనపై అనుమానం పెంచుకున్నాడు. ఆదివారం రాత్రి ఊరు వెళుతున్నానని భార్యకు చెప్పి పోవడంతో సాయిమనోహర్ ఆదివారం రాత్రి ఆ మహిళ ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి ఇంటికి వచ్చిన దుర్గాప్రసాద్ తన ఇంట్లో ఇద్దరు ఉండటం చూసి సాయిమనోహర్‌పై కత్తితో దాడి చేశాడు. దీంతో సాయిమనోహర్ అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య చేసిన దుర్గాప్రసాద్ అనంతరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల సర్వజన ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి అన్న భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

దసరా మహోత్సవాలకు మంత్రికి ఆహ్వానం



మంత్రి ఫరూక్‌ను ఆహ్వానిస్తున్న శ్రీశైలం దేవస్థానం సిబ్బంది

నంద్యాల రూరల్, సెప్టెంబరు 30: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు శ్రీశైల మల్లన్న దేవస్థానానికి రావాలనిమంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు శ్రీశైలం దేవస్థానం సూపరింటెండెంట్ ఉమేష్, వేదపండితులు ఆహ్వాన పత్రికను అందజేశారు. సోమవారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో మంత్రి ఫరూక్‌ను శ్రీశైల దేవస్థాన సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఫరూక్ మాట్లాడుతూ దసరా మహోత్సవాలకు శ్రీశైల దేవస్థానం సిబ్బంది తనను ఆహ్వానించడం చాలా సంతోషకరమైన విషయమని, హిందువులకు అతిపెద్ద పండుగలలో దసరా పండుగ ఒకటి అని అన్నారు. కార్యక్రమంలో శ్రీశైల దేవస్థానం వేదపండితులు మధుశంకర్, పవన్‌శర్మ, శ్రీనివాస్, సిబ్బంది సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

3న మండల సర్వసభ్య సమావేశం

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 30: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 3న మండల సర్వసభ్యసమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో నూర్జహాన్ తెలిపారు. ఈ సమావేశం మండల అధ్యక్షురాలు సువర్ణమ్మ అధ్యక్షతన జరుగుతుందని చెప్పారు. వివిధ శాఖల మండల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ పాల్గొనాలని చెప్పారు. మండల అధికారులు మండలంలో జరిగిన ప్రగతి నివేదికలను తీసుకురావాలని చెప్పారు.

'మాలల సంక్షేమానికి కృషి చేయాలి'

పాములపాడు, సెప్టెంబరు 30: ఏళ్ల తరబడి వెట్టి చాకిరి చేస్తున్న ఎట్టి (బ్యాగరి) మాలలను ప్రభుత్వం గుర్తించి వారి సంక్షేమానికి కృషి చేయాలని, శ్మశానాలలో మౌలిక వసతులు కల్పించాలని జాతీయ మాలమహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి అంకన్న అన్నారు. సోమవారం పాములపాడులో ఆయన మాట్లాడుతూ శ్మశానాల్లో నీటి వసతి కల్పించాలని, గది ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. బ్యాగరి సంఘం నాయకులు ఆవులయ్య, నాగస్వామి, ఏసన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'పనులు గుర్తించని సిబ్బందిపై చర్యలు'

పగిడ్యాల, సెప్టెంబరు 30: 2025-26కు సంబంధించి గ్రామాల్లో ఉపాధి హామీ పనుల గుర్తింపులో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బంది పై చర్యలు తప్పవని ఏపీడీ అన్వరాబేగం హెచ్చరించారు. మండలంలోని పగిడ్యాలలో ఉపాధి హామీ కార్యాలయంలో ఏపీవో మద్దిలేటి ఆధ్వర్యంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ గ్రామాలో కూలీలకు అవసరమైన పనులను డిసెంబరు నెలలోపు గుర్తించి నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. గ్రామాల్లో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన మేర పనులు గుర్తించాలని సూచించారు. సిబ్బందికి కేటాయించిన టార్గెట్లను పూర్తి చేయకపోవడంతో జిల్లాలోనే మండలం చివరి స్థానంలో ఉందని, జిల్లా స్థాయి అధికారులకు తాము సమాధానం చేప్పేందుకు ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. సిబ్బంది పని తీరులో మార్పులు రాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పండ్లతోటల పెంపకం, గోకులం షెడ్లపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. సమావేశంలో ఈసీ ఆశోక్, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

సారా స్వాధీనం

బండిఆత్మకూరు, సెప్టెంబరు 30: నారాయణపురం గ్రామంలో బాలీశ్వరమ్మ అనే మహిళ వద్ద 150 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. సోమవారం పోలీసులు దాడులు చేయగా పట్టుబడిందని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

'గ్రంథాలయ భవనాన్ని నిర్మించాలి'

నందికొట్కూరు, సెప్టెంబరు 30: నందికొట్కూరులోని మిడుతూరు రోడ్డులో గల గ్రంథాలయ స్థలంలో నూతన భవనాన్ని నిర్మించాలని సీపీఐ నాయకులు రఘురామ్మూర్తి, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ గతంలో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరిందని, దీంతో కనీస సదుపాయాలు లేని ఒక ప్రైవేటు గదిలో నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. ఏపీ మహిళా సంఘం నాయకురాలు రజితమ్మ, సులోచనమ్మ, విద్యార్థి నాయకులు హెశేన్, రమేష్, నాగేషులు, జిల్లా నాయకులు రంగస్వామి మద్దతు పలికారు.

వరద బాధితులకు చేయూత



రమేష్ రెడ్డికి చెక్కును అందజేస్తున్న ఐక్య సంఘాల నాయకులు

మిడుతూరు, సెప్టెంబరు 30: మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళా ఐక్య సంఘాల నాయకులు, పొదుపు మహిళలు విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సాయం అందించారు. గ్రామాలలో వసూలైన మొత్తం రూ.1,67860 చెక్కును ఏపీఎం సుబ్బయ్య ఆధ్వర్యంలో వెలుగు సిబ్బంది మండల సమాఖ్య కార్యాలయంలో టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డికి అందించారు. అనంతరం చెక్కు అమౌంటును జిల్లా సమైఖ్యకు బదిలీ చేసినట్లు ఏపీఎం తెలిపారు. కార్యక్రమంలో సీసీలు సయిరా బాను, స్వామన్న, కృష్ణా రెడ్డి, శంకరయ్య, మహిళా సమాఖ్య ఓబీలు, వీవోఏలు పాల్గొన్నారు.

'పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం'

మహానంది, సెప్టెంబరు 30: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ కేంద్రం టీచర్లు అన్నారు. సోమవారం పౌష్టికాహార మాసోత్సవాల ముగింపులో భాగంగా మహానంది మండలం అబ్బీపురం, గోపవరం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు సావిత్రి, ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు ముగిశాయి. అనంతరం పోషక విలువలు కల్గిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు చంద్రలీల, సరస్వతి పాల్గొన్నారు.

చెత్త నిల్వపై అవగాహన

పగిడ్యాల, సెప్టెంబరు 30: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా పగిడ్యాలలో తడి, పొడి చెత్త నిల్వలపై ఈవోఆర్డీ నాగేంద్రమయ్య ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో కలిసి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను నిల్వ చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరికీ రెండు చెత్త బుట్టలను అందజేయనున్నట్లు తెలిపారు. పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

నిందితుడి అరెస్టు

ఆత్మకూరు, సెప్టెంబరు 30: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఉమామహేశ్వరాలయంలో చోరీకి పాల్పడిన షేక్ మహబూబ్ బాషాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు సోమవారం ఆత్మకూరు అర్బన్ సీఐ ఓబులేసు నిందితుడిని మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు వెల్లడించారు. ఈ నెల 28న రాత్రి ఉమామహేశ్వరా లయం తాళాలు పెకిలించి హుండీలోని సొమ్మును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఆలయ అర్చకుడు శరత్‌కుమార్ శర్మ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి నిందితుడిని పట్టుకున్నట్లు చెప్పారు. నిందితుడి నుంచి రూ.24వేల నగదు, ఒక గ్యాస్ సిలిండర్, రెండు తులాల వెండి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితున్ని కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. ఆత్మకూరు సీఐ ఓబులేసు, ఎస్ఐ నారాయణరెడ్డి, క్రైమ్ పార్టీ పోలీసులను ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, డీఎస్పీ రామాంజీనాయక్ అభినందించారు.

విత్తనోత్పత్తి క్షేత్ర స్థలం ఆక్రమణకు యత్నం

● అడ్డుకున్న ఏడీఏ, వ్యవసాయ క్షేత్ర సిబ్బంది



ఎక్సకవేటర్‌తో చెట్లను తొలగిస్తున్న దృశ్యం



ఆక్రమణకు పాల్పడిన యువకుడిని హెచ్చరిస్తున్న ఏడీఏ

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 30: తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రంలోని అంతర్భాగమైన ఉద్యానవనంలోని స్థలాన్ని సోమవారం పట్టపగలే గ్రామానికి చెందిన వైసీపీ ప్రభుత్వంలో వలంటీరుగా పనిచేసిన యువకుడు ఎక్సకవేటర్‌తో ఆక్రమణకు యత్నించాడు. కేజీ రోడ్డు పక్కనే ఉన్న స్థలంలో క్షేత్రం అధికారుల కళ్లుగప్పి పెద్దపెద్ద వృక్షాలను తొలగించారు. గ్రామస్థులు క్షేత్రం ఏడీఏ అరుణలతకు ఫోను ద్వారా సమాచారం అందించారు. దీంతో ఏడీఏ, సిబ్బంది స్థలాన్ని పరిశీలించారు. ఏఅధికారంతో క్షేత్రం స్థలంలోకి ఎక్సకవేటర్ తీసుకొచ్చి ఆక్రమించుకుంటున్నావని యువకుడిని హెచ్చరించారు. ఈ విషయాన్ని తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఏడీఏ అరుణలత విలేకర్లతో చెప్పారు. చెట్లను తొలగించినందుకు వాల్టాచట్టం కింద తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తామని, స్థలం ఆక్రమణకు యత్నించడంతో పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

నందీశ్వరుడికి ప్రదోషకాల పూజలు



ప్రదోషకాల పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

మహానంది, సెప్టెంబరు 30: మహానంది క్షేత్రంలో సోమవారం సాయంత్రం భాద్రపద బహుళ త్రయోదశి మహా ప్రదోషకాలం పురష్కరించుకొని ఆలయ వేదపండితులు ఘనంగా ప్రదోషకాల పూజలను నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయం ముందు భాగంలోని రాతి నందీశ్వరుడికి వివిధ ద్రవ్యాలతో అభిషేకం జరిపారు. అనంతరం శాస్త్రోక్తంగా నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పల్లకీ ఉత్సవం: మహానంది ఆలయంలో సోమవారం రాత్రి పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు జరిపారు.

'దేవాలయాలను ధార్మిక సంఘాలకు అప్పగించాలి'



నిరసన ర్యాలీలో పాల్గొన్న ధార్మిక, వ్యాపార, కుల సంఘాల నాయకులు, కార్యకర్తలు

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 30: హిందూ దేవాలయాలను ధార్మిక సంఘాలకు అప్పగించాలని విశ్వహిందూ పరిషత్ నాయకులుకోరారు. సోమవారం విశ్వహిందూ పరిషత్ అన్ని ధార్మిక వ్యాపార, కుల సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం భారీ నిరసన ర్యాలీ చేపట్టింది. భరతమాత దేవాలయం నుంచి కల్పన సెంటర్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. తిరుమల వేంకటేశ్వరస్వామి మహాప్రసాదం లడ్డూలో కల్తీ నెయ్యి వాడి హిందువుల మనోభావాలు దెబ్బతీసిన వారిని కఠినంగా శిక్షించాలని, అన్యమత ఉద్యోగులను దేవాలయ విధుల నుంచి తొలగించాలని కోరుతూ దేశ వ్యాప్త నిరసన ఉద్యమంలో భాగంగా నంద్యాలలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు చంద్రమౌళీశ్వరరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ పోలేపల్లి సందీప్, ఆర్ఎస్ఎస్ ప్రచార కార్యదర్శి చింతలపల్లె వాసు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మందుల అమ్మకాల నిలిపివేత

నంద్యాల రూరల్, సెప్టెబంరు 30: నంద్యాల పట్టణంలోని దుర్గా భవానీ ఫర్టిలైజర్స్‌లో సరైన పత్రాలులేని ఫర్టిలైజర్స్ అమ్మకాలను వ్యవసాయ అధికారులు నిలిపివేశారు. సోమవారం నంద్యాల, డోన్ వ్యవసాయ సహాయ సంచాలకులు రాజశేఖర్, అశోకవర్ధన్‌రెడ్డి, నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావ్ పట్టణంలోని పలు ఫెర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీచేశారు. దుర్గా ఫర్టిలైజర్స్ దుకాణంలో సరైన పత్రాలు లేని మందులను గుర్తించి వాటి అమ్మకాలను నిలిపివేశారు. డోన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు అశోకవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సుమారు 478 కేజీల, 4.90 లక్షల విలువచేసే ఫర్టిలైజర్స్ అమ్మకాలను నిలిపి వేసినట్లు తెలిపారు. రైతులు అడిగిన మందులను మాత్రమే విక్రయించాలని నంద్యాల వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజశేఖర్ ఆదేశించారు.

వెలుగోడు: మండలంలోని ఎరువుల దుకాణదారులు ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని వ్యవసాయాధికారి పవన్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం వెలుగోడులోని ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. శ్రీనివాస ఆగ్రో కెమికల్స్ దుకాణాన్ని తనిఖీ నిర్వహించి ఎరు వుల నిల్వలను, రిజిస్టర్లను పరిశీలించారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కొలను భారతి క్షేత్ర ఈవో బదిలీ

కొత్తపల్లి, సెప్టెంబరు 30: సాధారణ బదిలీల్లో భాగంగా కొత్తపల్లి మండలంలోని కొలనుభారతి పుణ్యక్షేత్రం ఈవో మోహన్‌ను అధికారులు బండి ఆత్మకూరు మండలం ఏకోడూరు గ్రూపు దేవస్థానానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రూపు దేవాలయాలకు విధులు నిర్వహిస్తున్న రామలింగారెడ్డిని కొలను భారతి ఇన్‌చార్జి ఈవోగా నియమించారు.

పాఠశాలకు ఇన్వర్టర్ వితరణ

వెలుగోడు, సెప్టెంబరు 30: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో సోమవారం ఇన్వర్టర్, బ్యాటరీలను పాఠశాలకు అందించారు. పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు భాగస్వామ్యం కావాలని హెచ్ఎం సత్యనారయణరావు అన్నారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ షేక్ ఖాదర్‌బాషా, పూర్వ విద్యార్థులు గోపాల్, ఇంతియాజ్, శ్రీకాంత్, వాహిద్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా ఆంజనేయులు

ఆత్మకూరు, సెప్టెంబరు 30: ఆత్మకూరు డిప్యూటీ తహసీల్దార్‌గా ఆంజనేయులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న హరికృష్ణ జిల్లాలో ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా పాణ్యం నియోజకవర్గంలోని గడివేములకు వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో వెలుగోడు డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆంజనేయులు ఆత్మకూరుకు వచ్చారు. ఆయన తహసీల్దార్ రత్నరాధికను మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా కార్యాలయ సిబ్బంది ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి: కలెక్టర్



విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న కలెక్టర్, జేసీ, అధికారులు

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 30: స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌పై పాఠశాల విద్యార్థుల ఉపన్యాస భావాలు అందరికీ స్ఫూర్తిదాయకం కావాలని, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ రాజకుమారి ఆకాంక్షించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో పీజీఆర్ఎస్ వేదికలో భాగంగా స్వర్ణాంధ్ర2047 క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం కలెక్టర్‌తో పాటు జేసీ విష్ణుచరణ్ జ్ఞాపికలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర 2047 దార్శనిక పత్ర రూపకల్పనపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ప్రణాళికలో విద్యార్థులు వివిధ అభివృద్ధి అంశాలను జోడిస్తూ ప్రసంగించిన తీరు అందరిని ఆకట్టుకుందన్నారు. పోటీలలో పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన పాఠశాల విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు జ్ఞాపికలు అందజేశారు.

ఆత్మకూరు: స్వర్ణాంధ్ర-2047 అంశానికి సంబంధించి జిల్లా స్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ ప్రతిభా పోటీల్లో ఆత్మకూరు విద్యార్థులు సత్తా చాటారు. నంద్యాలలోని హోలీక్రాస్ పాఠశాలలలో సోమవారం నిర్వహించిన ఈ పోటీల్లో వక్తృత్వ విభాగంలో ఆత్మకూరులోని డీపాల్ హైస్కూల్‌కు చెందిన హర్షిణి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. డిబేట్ విభాగంలో పద్మావతి హైస్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నారు. వ్యాసరచన పోటీల్లో చైతన్య హైస్కూల్‌కు చెందిన సనావుల్లా జిల్లాస్థాయిలో తృతీయ స్థానాన్ని సొంతం చేసుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులను, ప్రశంస పత్రాలను అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంఈవోలు బాలాజీనాయక్, సురేష్‌లు అభినందించారు.

హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడిగా చాణక్యరాజ్



చాణక్యరాజ్‌ను అభినందిస్తున్న హాకీ సంఘం నాయకులు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 30: హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా నంద్యాలకు చెందిన రిటైర్డ్ డీఎఫ్‌వో చాణక్యరాజ్ ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరులో జరిగిన హాకీ ఆంధ్రప్రదేశ్ సర్వసభ్య సమావేశంలో చాణక్యరాజ్‌ను రెండోసారి హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారంనంద్యాలలోని ఎస్పీజీ ఉన్నత పాఠశాలలో నంద్యాల జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేసి ఆయనను ఘనంగా సన్మానించారు. హెచ్ఎం జీవలత, హాకీ జాయింట్ సెక్రటరీ దివాకర్, మాణిక్యరాజ్, స్టీఫెన్, కెనెడీ, సీనియర్ హాకీ క్రీడాకారులు శ్రావణ్‌కుమార్, మధు, లహరి తదితరులు పాల్గొన్నారు.

'పౌర హక్కులను సద్వినియోగం చేసుకోవాలి'



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ జగన్మోహన్

బండిఆత్మకూరు, సెప్టెంబరు 30: దళితులు తమకున్న హక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ జగన్మోహన్ సూచించారు. సోమవారం రాత్రి బండిఆత్మకూరు ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని పురష్కరించుకుని ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ యాక్టలను దుర్వినియోగం చేయవద్దని సూచించారు. దురాశకు వెళ్లి సైబర్ మోసాలకు గురికావొద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకూడదని ఆదేశించారు.

'సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి'

పాములపాడు, సెప్టెంబరు 30: నేటి సమాజంలో ప్రజలు సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని పాములపాడు ఎస్ఐ సురేశ్‌బాబు సూచించారు. సోమవారం మండలంలోని రుద్రవరం గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులతో సమావేశం నిర్వహించారు. పోలీసులు రసూల్ పాల్గొన్నారు.

'పొగాకు రహిత సమాజానికి కృషి చేద్దాం'

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 30: పొగాకు రహిత సమాజం కోసం పాటు పడదామని, ఇందుకోసం పాఠశాలలు, వాటి పరిసరాలు పొగాకు రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దుతున్నట్లు కురుకుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటస్వామి, టీబీ సూపర్‌వైజర్ మస్తానయ్య అన్నారు. పాఠశాలల ఉపాధ్యాయులు, వైద్యఆరోగ్య శాఖ అధికారుల సమన్వయంతో మండలంలోని కురుకుంద గ్రామంలో విద్యా సంస్థలను పొగాకు రహిత ప్రాంతాలుగా ఉండేలా చర్యలకు గ్రామస్థులు సహకరించాలని వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సైన్స్ ఉపాధ్యాయులు మాధవి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం'

కొత్తపల్లి, సెప్టెంబరు 30: తల్లిదండ్రులు యుక్త వయస్సురాక ముందే వారి పిల్లలకు బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని కొత్తపల్లి ఎస్ఐ కేశవ తెలిపారు. సోమవారం కొత్తపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో హెచ్ఎం వెంకటేశ్వర్లు అధ్యక్షతన విద్యార్థులకు బాల్య వివాహాల నివారణపై, సైబర్ నేరాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు.

బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక



మహిళా జట్టు



పురుషుల జట్టు

పాణ్యం, సెప్టెంబరు 30: ఆలిండియా సౌత్ జోన్ యూనివర్సిటీ క్రీడలకు జేఎన్‌టీయూఏ బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు సోమవారం జరిగాయి. శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఈ క్రీడలను జేఎన్‌టీయూ స్పోర్ట్స్ డైరెక్టర్ జోజిరెడ్డి ప్రారంభించారు. ఈ క్రీడల్లో జేఎన్‌టీయూఏ పరిధిలోని 30 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నవంబరులో తమిళనాడులోని అలగప్ప యూనివర్సిటీలో జరిగే జాతీయ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలలో మహిళలు, బెంగళూరులోని నార్త్ యూనివర్సిటీలో జరిగే పోటీలలో పురుషులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఎంపిక కమిటీ సభ్యులు సురేష్‌బాబు, బాబు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి

● తిరుమల లడ్డూ విషయంలో జగన్ రాజకీయం

● ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు, సెప్టెంబరు 30: రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. సోమవారం పట్టణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ తిరుమల లడ్డూ విషయం జగన్మోహన్ రెడ్డి రాజకీయం చేస్తున్నారన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా జగన్ ప్రవర్తిస్తున్నార న్నారు. మతాల మధ్య విభేదాలను సృష్టించేందుకే జగన్మోహన్ రెడ్డి ఆలోచన ఉన్నట్టు ఉందని అనుమానం వ్యక్తం చేశారు. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త ధార సుధీర్ నియోజకవర్గంలోకి వచ్చి దేవాలయాల్లో ప్రక్షాళన చేయడం కాదని, ముందు జగన్మోన్ రెడ్డి మనసు, ఆలోచనలను ప్రక్షాళన చేయాలని పూజలు నిర్వహించి ఉంటే బాగుండేదని అన్నారు. నియోజకవర్గంలోని వైసీపీ నాయకులకు దేవాలయాలను ముట్టుకునే అర్హత లేదని ఎమ్మెల్యే అన్నారు. మాజీ ఎంపీపీ వీరం ప్రసాద్ రెడ్డి టీడీపీ నాయకులు పలుచాని మహేశ్వర రెడ్డి, లాయర్ జాకీర్ హుసేన్, ముర్తుజావలి, తదితరులు పాల్గొన్నారు.

'క్రీడల్లోనూ రాణించాలి'

నందికొట్కూరు, సెప్టెంబరు 30: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆకాంక్షించారు. నందికొట్కూరు ప్రభుత్వ బాలుర పాఠశాలలో నియోజకవర్గ స్థాయి పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, టీడీపీ నాయకులు లాయర్ జాకీర్, ముర్తుజావలి, షకీల్ అహమ్మద్, ఆర్టు శ్రీను, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

● నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో ఎమ్మెల్యే జయసూర్య పాల్గొన్నారు. విద్యార్థులు ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

● దసరా నవరాత్రుల సందర్భంగా ఆత్మకూరు రోడ్డులోని జమ్మిచెట్టు వద్ద నిర్వహిస్తున్న పనులను ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దసరా పండగ నేపథ్యంలో జమ్మికోసం జమ్మి చెట్టు వద్దకు వచ్చే భక్తులకు పట్టణ ప్రజలకు అన్ని సైకర్యాలు కల్పించాలని అధికారులకు, ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు.

'డీఎస్సీ ఉచిత శిక్షణకు చర్యలు'



డీఎస్సీ అభ్యర్థులకు మెటీరియల్‌ను అందజేస్తున్న ఫిరోజ్

నంద్యాల రూరల్, సెప్టెంబరు 30: డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉర్దూ మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమంలో శిక్షణా తరగతులు, ఉచిత మెటీరియల్‌ను అందించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. సోమవారం జోయా ఉర్దూ కోచింగ్ సెంటర్, రాజేశ్వరి కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆగస్టు 1నుంచి సెప్టెంబరు 5వరకు డీఎస్సీలో ఉచిత శిక్షణ పొందిన విద్యార్థులకు సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్, మైనార్టీ సంక్షేమశాఖ ప్రచురితమైన టెట్ -2024 ఎస్జీటీ మెటీరియల్‌ను ఫిరోజ్ హాజరై పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ల డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

'మహాసభలను విజయవంతం చేయండి'



పోస్టరును ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గడివేముల, సెప్టెంబరు 30: ఏపీటీఎఫ్ ఆవిర్భవించి 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అక్టోబరు 6, 7, 8 తేదీల్లో విజయనగరంలో జరిగే ఓక్ జూబ్లీ వేడుకలను, 20న జరిగే రాష్ట్ర విద్య వైజ్ఞానిక సభలను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు ఉపాధ్యాయులను కోరారు. మండలంలోని గడిగరేవుల హైస్కూల్‌లో సోమవారం ఏపీటీఎఫ్ సమావేశం నిర్వహించారు. అనంతరం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఏపీటీఎఫ్ జిల్లా మహిళ కార్యదర్శి కవిత, మండల శాఖ అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు బాలస్వామి, రాంపుల్లారెడ్డి, శ్రీరాములు, మల్లికార్జున, మారెన్న, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

గడివేముల, సెప్టెంబరు 30: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థినులకు సోమవారం ఎస్ఐ నాగార్జునరెడ్డి గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, మహిళ సంబంధిత నేరాలపై, రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బాలికలు, మహిళలపై సమాజంలో లైంగిక దాడులు జరుగుతున్నాయని అన్నారు. ఈ దాడులను ధైర్యంగా ఎదుర్కోవాలని అన్నారు. ఆదర్శ పాఠశాల హెచ్ఎం శైలజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పేదల భూములకు పట్టాలు ఇవ్వాలి'



ఆర్డీవో దాసుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 30: బండిఆత్మకూరు మండలంలోని ఈర్నపాడులోని సర్వే నంబర్ 542లో అనుభవంలో ఉన్న పేదల భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించి పట్టాలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, నాయకులు వీరన్న, సంజీవరాయుడు, సుధాకర రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో ఎం.దాసుకు వినతిపత్రాన్ని అందజేశారు. బండిఆత్మకూరు, కొత్తపల్లి, ఆత్మకూరు మండలాల్లోని ప్రభుత్వ భూములను ఎన్నో ఏళ్లుగా పేదులు అనుభవిస్తున్నారని అయితే వాటికి పట్టాలు, పాస్‌పుస్తకాలు లేకపోవడంతో బ్యాంకు రుణాలు, ఇతర రాయితీ పథకాలు వర్తించడం లేదని వివరించారు. 167కే జాతీయ రహదారి విస్తరణలో ఇలాంటి భూములను కోల్పోయిన రైతులకు పట్టాభూముల తరహాలోనే పరిహారం చెల్లించాలని అన్నారు. నాయకులు రాజు, శంకరమ్మ, లలితమ్మ ఉన్నారు.

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా రామాంజనేయులు

నందికొట్కూరు, సెప్టెంబరు 30: నందికొట్కూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్. రామాంజనేయులు సోమవారం విధులకు హాజరు అయ్యారు. ఆయన కోడుమూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసి సాధారణ బదిలీలో భాగంగా నందికొట్కూరుకు బదిలీ అయినట్లు ఆయన తెలిపారు.

సబ్ జైలు సూపరింటెండెంట్ పదవీ విరమణ

నందికొట్కూరు, సెప్టెంబరు 30: నందికొట్కూరు సబ్ జైల్ సూపరింటెంట్ మల్లయ్య పదవీ విరమణ పొందారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి జీవితంలో పదవి విరమణ తప్పదని అన్నారు. మల్లయ్యను నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం, జైలు సిబ్బంది, కుటుంబ సభ్యులు పూలమాలతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు.

'కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములు'

డోన్(రూరల్), సెప్టెంబరు 30: డోన్ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని, వీటిపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూములను కాపాడాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షులు తెలుగు విజయకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాల కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ రాజకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. తెలుగు విజయకుమార్ మాట్లాడుతూ డోన్ పట్టణ పరిసరాల్లో పోరంబోకు భూములను కొంత మంది స్వార్థపరులు అధికారులతో కుమ్మక్కై వాటిని కబ్జా చేసి వెంచర్లు వేసి రియల్ ఎస్టేట్ దందా నడుపుతున్నారని ఆరోపించారు.

డోన్ మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

డోన్(రూరల్), సెప్టెంబరు 30: డోన్ మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రసాద్‌గౌడుకు గౌడ సంఘం నాయకులు సత్కరించారు. సోమవారం కమిషనర్ కార్యాలయంలో కలిసి ఆయనకు శాలువలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు మద్దిలేటి గౌడు, రంగస్వామి గౌడు, వెంకటేశ్ గౌడు, కుమార్‌స్వామి గౌడు తదితరులు ఉన్నారు.


డోన్ కమిషనర్‌ను సత్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

డోన్ ఎక్సైజ్ సీఐగా వరలక్ష్మి



డోన్(రూరల్), సెప్టెంబరు 30: డోన్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ సీఐగా వరలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ జయనాథరెడ్డి అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కడప జిల్లా ఇంటెలిజెన్స్ వింగ్ నుంచి వరలక్ష్మి వచ్చారు. అలాగే ఎస్‌ఐగా సోమశేఖర్ బాధ్యతలు చేపట్టారు.

న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకు రావాలి

డోన్(రూరల్), సెప్టెంబరు 30: న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయాలని డోన్ బార్ అసోసియేషన్ మాజీ కోశాధికారి పులిదా మోదర్ డిమాండ్ చేశారు. సోమవారం రాజస్థాన్, ఢిల్లీ తరహాలో ఏపీలో కూడా న్యాయవాదులకు ప్రొటెక్షన్ యాక్టును అమలు చేయాలని న్యాయవాదులు చేపడుతున్న సంతకాల సేకరణ పత్రాన్ని డోన్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ గౌడుకు అందజేశారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

ప్యాపిలి, సెప్టెంబరు 30: పట్టణంలోని ప్రియదర్శిని యూపీ పాఠశాల యాజమాన్యం విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.30 వేల ఆర్థిక సాయం అందజేసింది. ప్రైవేటు పాఠశాల సంఘం రాష్ట్ర డైరెక్టర్ చంద్రశేఖర్‌కు సోమవారం ప్యాపిలిలో అందజేశారు. కార్యక్రమంలో సంఘం నేతలు అక్బర్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న ప్రియదర్శిని పాఠశాల హెచ్‌ఎం

సింగిల్ విండో మాజీ చైర్మన్ మృతి

డోన్, సెప్టెంబరు 30: డోన్ సింగిల్ విండో మాజీ చైర్మన్ క్వాలిటీ బాషు (71) సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. పట్టణానికి చెందిన క్వాలిటీ బాషు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం కర్నూలులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. డోన్ సింగిల్ విండో చైర్మన్‌గా క్వాలిటీ బాషు పదేళ్ల పాటు పని చేశారు. అప్పట్లో రైతుల కోసం ఎన్నో కార్యక్రమాలన్నీ చేపట్టి ఆయన ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారు.


బాషు (ఫైల్)

● సింగిల్ విండో మాజీ చైర్మన్ క్వాలిటీ బాషు మృతికి రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి సంతాపం తెలిపారు. ఆయన భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళురల్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. అదే విధంగా మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మాజీ ఉప సర్పంచ్ చిట్యాల మద్దయ్యగౌడు, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ కొచ్చెర్వు విక్రమసేనా రెడ్డి, సిద్ధార్థ కృష్ణారెడ్డి, దూదేకుల అసోసియేషన్ నాయకులు తదితరులు క్వాలిటీ బాషు మృతికి సంతాపం తెలిపారు.

టీడీపీ సభ్యత్వాన్ని వేగవంతం చేద్దాం

డోన్, సెప్టెంబరు 30: డోన్ నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వాన్ని వేగవంతం చేద్దామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బూత్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో వలసల రామకృష్ణ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, ఓబులాపురం శేషిరెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. వలసల రామకృష్ణ మాట్లాడుతూ గత వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం జరిగింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. తిరుమల లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసి భక్తుల మనోభావాలను గత వైసీపీ ప్రభుత్వం దెబ్బతీసిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు మేలు చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి నాయకత్వంలో డోన్ నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వాన్ని జిల్లాలోనే అగ్రస్థానంలో నిలుపుదామన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు చనుగొండ్ల శ్రీరాములు, రవి, ఆయా గ్రామాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'ప్లాస్టిక్ రహిత నల్లమలే లక్ష్యం'

రుద్రవరం, సెప్టెంబరు 30: ప్లాస్టిక్‌రహిత నల్లమలే లక్ష్యమని డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి అన్నారు. రుద్రవరం రేంజ్‌లోని భార్గవ నర్సింహస్వామి దేవాలయం ముందు ఉన్న కోనేరులో ప్లాస్టిక్ కవర్లు, ఆకులను తొలగించారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు మక్తర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, బీట్ ఆఫీసర్లు రామకృష్ణ, నరసింహారెడ్డి, నాగహుసేనయ్య ఉన్నారు.


కోనేరును శుభ్రం చేస్తున్న దృశ్యం

చివరి మజిలీకి ఎంత కష్టమో..!


గుళ్లదుర్తిలో ఇరుకు రహదారిలో శవాన్ని మోసుకెళ్తున్న దళితులు

కోవెలకుంట్ల, సెప్టెంబరు 30: చివరి మజిలీకి కష్టాలు తప్పడం లేదు. గ్రామాల్లో శ్మశానానికి దారులు లేకపోవడం, ఊరికి దూరంగా ఉండడంతో శవాలను ఖననం చేసేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుళ్లదుర్తి గ్రామానికి ఓ వ్యక్తి సోమవారం మృతి చెందాడు. అయితే శ్మశానానికి రహదారి లేకపోవడంతో శవాన్ని పంట పొలాల మధ్యనే తీసుకెళ్లారు. ఇప్పటికైనా కలెక్టరు స్పందించి ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద శ్మశానానికి వెళ్లే దారిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


చాగలమర్రి: జగనన్న లేఔట్‌ల సమీపంలో పడేసిన చెత్తా చెదారం

చెత్త ఫుల్ సంపద నిల్

- జగనన్న లేఔట్‌లలో చెత్తా చెదారం
- తుప్పు పట్టిన ట్రై సైకిళ్లు
- పంచాయతీ నిధులు వృథా
- నామమాత్రంగా స్వచ్ఛతా హీ సేవా

చెత్తాచెదారం రోడ్లపైనే పారవేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెత్త కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. రోడ్డుపై వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంప్ యార్డు లేకపోవడంతో రోడ్డుపై వేస్తున్నారని వాపోతున్నారు. అలాగే చెత్త సేకరణ కోసం మంజూరైన ట్రై సైకిళ్లు కూడా మూలనపడేశారు. అధికారులు డంప్ యార్డుకు స్థలం కేటాయించి, రోడ్డుపైనే చెత్తవేయకుండా చూడాలని కోరుతున్నారు.


ముత్యాలపాడులో శిథిలావస్థలో డంపింగ్ యార్డు షెడ్డు

చాగలమర్రి, సెప్టెంబరు 30: చాగలమర్రిలో చెత్తచెదారం రోడ్డు పక్కనే వేస్తున్నారు. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. చాగలమర్రి మేజర్ పంచాయతీలో ఐదేళ్లుగా డంపింగ్‌యార్డు స్థల సేకరణకు, యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోలేదు. దీంతో గ్రామంలోని చెత్తా చెదారం ఆయా రహదారుల్లో వేయడంతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. పలు వీధుల్లో చెత్త, వ్యర్థాలు నిండి రోడ్డుపైనే పడటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించకపోవడంతో పారిశుధ్య కార్మికులు సేకరించిన చెత్తా చెదారం రోడ్లపై వేస్తున్నారు. ఇంత వరకు స్థలం సేకరించకపోవడంతో డంపింగ్ యార్డు పనులు చేపట్టలేదు. చెత్తా చెదారం ఎత్తి వేయడానికి ట్రై సైకిళ్లను గతంలో పంపిణీ చేశారు. వాటిని మూలన పడేసి వదిలేశారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం కావడం తప్ప చెత్త శుభ్రం చేయడానికి ఉపయోగించలేదు. ట్రాక్టర్లతో నామమాత్రంగా చెత్తా చెదారం తొలగిస్తున్నారు. మల్లేవేముల రహదారి, జగనన్న లేఔట్‌లలో వేసిన చెత్తా చెదారానికి నిప్పు పెడుతుండటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి డంపింగ్‌యార్డు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ముత్యాలపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు షెడ్డు గాలి, వాన బీభత్సానికి కుప్పకూలిపోయి మూడేళ్లవుతున్నా ఇంతవరకు మరమ్మతులు చేపట్టలేదు. గ్రామంలోని చెత్తా చెదారం వేసేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హరిత రాయబారులు చెత్తా చెదారం ఊరి చివరలో పడేస్తున్నారు. ఇలాగైతే రోగాలు రావా అంటూ ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంపై ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్‌ను వివరణ కోరగా మండలంలోని 13 గ్రామాల్లో డంపింగ్ యార్డులు ఉన్నాయని, చాగలమర్రి మేజర్ పంచాయతీలో స్థల సమస్య వల్ల పనులు జరగలేదని అన్నారు. మూడు షెడ్లు దెబ్బతిన్నాయని అన్నారు. ఆయా గ్రామాల్లో పనులు వేగవంతం చేసేందుకు దృష్టి సారించామని, అక్టోబరు 2 నాటికి పనులు పూర్తి చేసి చెత్తా చెదారం కేంద్రాలకు తరలించి పారిశుధ్య నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


చాగలమర్రి పంచాయతీ కార్యాలయం నీటి ట్యాంకు వద్ద పడేసిన ట్రై సైకిళ్లు

సీఎం చంద్రబాబుతోనే అన్ని వర్గాలకు న్యాయం

ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, సెప్టెంబరు 30: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంఎస్‌ఆర్ కార్యాలయంలో సుబ్బారెడ్డిని ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అదేవిధంగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి సన్మానించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రానికి ఎన్నో కొత్త పరిశ్రమలు వస్తున్నాయన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. కష్టపడే వారికి పార్టీలో తప్పనిసరిగా న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు సీఎం శ్రీనివాసులు, టీడీపీ నాయకులు ధర్మవరం చిన్న నాగిరెడ్డి, గౌతమ్ రెడ్డి, యాపదిన్నె సర్పంచ్ రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ధర్మవరం సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

'డెంగీతో అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, సెప్టెంబరు 30: గ్రామాల్లో ప్రజలు డెంగీతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ఇమ్రాన్ సూచించారు. మండలంలోని రాంపల్లె గ్రామంలో సోమవారం ఎఫ్‌డీ కార్యక్రమాన్ని నిర్వహించి వివిధ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్నబోదనం గ్రామంలో వైద్యులు అంజలి ఆధ్వర్యంలో ఎఫ్‌డీ కార్యక్రమాన్ని నిర్వహించి వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, శేఖర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 30 : కొలిమిగుండ్లలో దోమల నివారణ కోసం అధికారులు చర్యలు చేపట్టారు. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో బాబోయ్ దోమలు అనే శీర్షిక ప్రచురితం కావడంతో ఎర్రవాగు కాలువను శుభ్రం చేశారు. సర్పంచ్ శివ ఆధ్వర్యంలో కాలువలోని చెత్త, కంప, మురికి నీటిని తొలగించినట్లు తెలిపారు.

హుండీ ఆదాయం రూ.12.24 లక్షలు

బేతంచెర్ల, సెప్టెంబరు 30: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామి, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల హుండీల లెక్కింపులో రూ.12.24 లోల ఆదాయం వచ్చినట్లు ఉప కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి రామాంజనేయులు సోమవారం తెలిపారు. ఈ హుండీల లెక్కింపు దేవాదా శాఖ అధికారి చక్రభరత్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది 34 రోజులకు సంబంధించిన హుండీల లెక్కింపు నిర్వహించారని తెలిపారు. మద్దిలేటి స్వామి హుండీ లెక్కింపులో రూ.10,22,714 నగదు, బంగారం 7 గ్రాముల 354 మిల్లీ గ్రాములు, వెండి 750 గ్రాములు, మహాలక్ష్మి అమ్మవారి హుండీ లెక్కింపులో రూ.2,01,599 నగదు లభించినట్లు ఆయన తెలిపారు. మొత్తం స్వామి, అమ్మవార్ల హుండీల లెక్కింపులో 12,24,318ల నగదు, బంగారు 7 గ్రాముల 354 మిల్లీ గ్రాములు, వెండి 750 గ్రాముల ఆదాయం లభించినట్లు తెలిపారు.

ట్రావెల్ బస్సుకు భారీ జరిమానా

డోన్(రూరల్), సెప్టెంబరు 30: రాష్ట్రంలో రోడ్డు ట్యాక్స్ కట్టకుండా తిరుగుతున్న ట్రావెల్ బస్సుకు డోన్ ఆర్టీవో అధికారులు భారీ జరిమానా విధించారు. తెలంగాణ రాష్ట్రం వరంగల్‌కు చెందిన ట్రావెల్ బస్సు నకిలీ పత్రాలతో తిరుగుతుండగా డోన్ హైవే టోల్‌ప్లాజా వద్ద డోన్ ఆర్టీవో క్రాంతి కుమార్ తనిఖీలు చేస్తుండగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆర్టీవో క్రాంతి కుమార్ మాట్లాడుతూ ట్రావెల్ బస్సుకు రూ.1,03,600లు జరిమానా విధించి ట్రావెల్ బస్సును జప్తు చేసి డోన్ ఆర్టీసీ డిపోకు తరలించినట్లు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి: ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), సెప్టెంబరు 30: ఆళ్లగడ్డ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యే అఖిలప్రియ సీఎం చంద్రబాబునాయుడును సోమవారం సాయంత్రం కలిశారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గుర్తించిన సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి కనుమరుగైందని అన్నారు. ఎన్నికల ముందు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడంతో పాటు ఆళ్లగడ్డ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని సీఎం తెలిపినట్లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వెల్లడించారు.


ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

వరిలో ఆకు ముడత పురుగు

సంజామల, సెప్టెంబరు 30: వరి పంటకు సోకే ఆకుముడత పురుగును నివారించుకోవాలని వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి రైతులను కోరారు. సోమవారం సంజామల రైతు సేవా కేంద్రంలో ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పంటకు ఆకుముడత పురుగు ఎర్రనల్లి, దోమ అధికంగా వ్యాప్తి చెందిందన్నారు. వీటి వలన పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందని పురుగు నివారించుకోవాలని రైతులను సూచించారు. రెండు మిల్లీలీటర్ల క్లోరోఫైరిపాస్, ఒక లీటరు నీటిలో 1గ్రాము అసిఫెట్ కలిపి ఈ మోతాదున కలుపుకొని పంటపై పిచికారి చేసి పురుగును నియంత్రించుకోవాలని కోరారు.

చెత్త సేకరణ కేంద్రాల పునరుద్ధరణ

అవుకు, సెప్టెంబరు 30 : మండలంలోని చెత్త సేకరణ కేంద్రాలను పునరుద్ధరిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి సోమవారం తెలిపారు. ఈ ఎంపీడీవో మాట్లాడుతూ స్వచ్ఛత హీ కార్యక్రమంలో భాగంగా గతంలో టీడీపీ ప్రభుత్వం నిర్మించిన చెత్త సేకరణ కేంద్రాలను పునరుద్ధరించి అందుబాటులోకి తెచ్చామన్నారు. గ్రామాల్లోని పారిశుధ్య కార్మికులు తడి, పొడి చెత్తను సేకరించి వేరుచేసి సంపదను సృష్టించటమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రామక్రిష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, సుధాకర్, చక్రి, మనోజ్, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ నాగార్జున పాల్గొన్నారు.

ఉప చానల్ గండి పూడ్చివేత

రుద్రవరం, సెప్టెంబరు 30: ఆయకట్టుకు అందని సాగు నీరు అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో సెప్టెంబరు 14న కథనం ప్రచురితమైంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. సోమవారం 19వ గంగ బ్లాక్ చానల్‌లోని ఉప చానల్ గండిని ఎక్సకవేటర్లతో పూడ్చివేయించినట్లు ఏఈ రామశేషు తెలిపారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సహకారం అందించినట్లు ఆయన తెలిపారు. ఈ గండి పూడ్చడంతో అప్పనపల్లె చిన్నకంబలూరు, కొండమాయపల్లె, వెలగలపల్లె, రుద్రవరం గ్రామాల రైతు పంట పొలాలకు సాగునీరందుతుందని ఏఈ తెలిపారు.

విధేయతకే పట్టం


ధర్మవరం సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బనగానపల్లె, సెప్టెంబరు 30 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధర్మవరం సుబ్బారెడ్డి కష్టాన్ని గుర్తించి సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా అవకా శం కల్పించి విధేయతకు పట్టం కట్టారని టీడీపీ నంద్యాల జిల్లా వాణిజ్య విభాగాల అధ్యక్షుడు టంగుటూరు శీనయ్య అన్నారు. సోమవారం బనగానపల్లె టీడీపీ నాయకులు టంగుటూరు శీనయ్యతో పాటు మల్లారెడ్డి, నాగేంద్రరెడ్డి, నాగరాజు, ఖాదర్, రఘురామిరెడ్డి, హరి, రాంబాబు, గోపాల్‌రెడ్డి, ప్రసాద్, నాగేష్‌బాబు డోన్‌కు వెళ్లి ధర్మవరం సుబ్బారెడ్డిని కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డోన్ పట్టణ టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పశుబీమా చేయించుకోవాలి'

చాగలమర్రి, సెప్టెంబరు 30: గ్రామాల్లో రైతులు పశువులకు పశుబీమా చేయించుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ సూచించారు. సోమవారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో ఆయన మాట్లాడుతూ పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. గొర్రెలు, మేకలకు పారుడువ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామని, వాటి పెంపకందారులు పశువైద్య సిబ్బందికి సహకరించి టీకాలు వేయించుకోవాలని సూచించారు.

3 నుంచి దసరా ఉత్సవాలు

కోవెలకుంట్ల, సెప్టెంబరు 30 : పట్టణంలోని అంకాలమ్మ సర్కిల్ సమీపంలో వెలసిన మారెమ్మ దేవాలయంలో 3 నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఈ ఉత్సవాలు పది రోజుల పాటు కొనసాగుతాయన్నారు.

ఆళ్లగడ్డ(శిరివెళ్ల): విశ్వరూప నగర్‌లోని కాళికామాత ఆలయంలో ఈ నెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు దురుగడ్డ రవీంద్రాచారి, మహిళా కమిటీ అధ్యక్షురాలు దురుగడ్డ అనురాధ, కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, 12న విజయదశమి సందర్భంగా శమీ దర్శనం, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తామని వెల్లడించారు.

సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీ

కోవెలకుంట్ల, సెప్టెంబరు 30: రబీలో సాగు చేసే శనగ పంటకు సబ్సిడీ విత్తనాలను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని ఏవో నిరంజన్ తెలిపారు. సోమవారం ఏవో మాట్లాడుతూ 3 నుంచి తేదీ నుంచి రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

సబ్సిడీ యంత్రాల కోసం దరఖాస్తు చేసుకోండి

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 30: కోవెలకుంట్ల డివిజన్ పరిధిలోని మండలాల రైతులు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ యంత్రాలకు దరఖాస్తు చేసుకోవాలని హార్టికల్చర్ అధికారి ధరణి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మినీ ట్రాక్టర్లు, పవర్ ట్రిల్లర్లు, తైవాన్ స్ప్రేయర్లు సబ్సిడీతో అందిస్తున్నట్లు తెలిపారు. మినీ ట్రాక్టర్లు కావాల్సిన రైతులకు రూ.70 వేలు సబ్సిడీ, ఐదు ఎకరాల్లోపు పొలం ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు రూ.లక్ష సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. అలాగే ట్రిల్లర్‌కు రూ.70 వేలు, తైవాన్ స్ప్రేయర్‌కు రూ. 10 వేలు సబ్సిడీ ఇస్తుందని తెలిపారు.

'ఈకేవైసీ పూర్తి చేయాలి'

రుద్రవరం, సెప్టెంబరు 30: మండలంలోని రైతుల నుంచి ఈకేవైసీ పూర్తి చేయాలని ఏవో శ్రీకృష్ణ సూచించారు. సోమవారం మండల పరిధిలోని వీపీఏలతో సమీక్ష చేశారు. మంజూరైన ఎలుకల మందును రైతులకు పంపిణీ చేయాలన్నారు. పంట నమోదు పూర్తి చేసిన రైతుల నుంచి ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు.

'భూ సమస్యలు పరిష్కరించాలి'

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 30: భూ సమస్యలు పరిష్కరించాలని హరివరం గ్రామానికి చెందిన కొప్పెర ఓబులేసు కోరారు. సోమవారం మాల మహానాడు అధ్యక్షుడు కోగిల ప్రసాద్‌తో కలిసి తహసీల్దారు శ్రీనివాసులుకు వినతి పత్రం ఇచ్చారు. రైతు మాట్లాడుతూ తమ గ్రామంలోని తన పొలాన్ని కొలవటానికి ఆగస్టు 17న సచివాలయంలో చలానా చెల్లించానన్నారు. 45 రోజులు గడిచినా ఇంత వరకు కొలతలు వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తహసీల్దారు స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి కొలతలు వేయిస్తానని చెప్పారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థితో హెచ్‌ఎం, పీడీ

చాగలమర్రి, సెప్టెంబరు 30: చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పండు అనే విద్యార్థి జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ దాదాపీర్ సోమవారం తెలిపారు. అక్టోబరు 8న తెలంగాణ రాష్ట్రం హైదరాబాదులో జరిగే జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఏపీ రాష్ట్రం జట్టు తరఫున పాల్గొంటారని అన్నారు. ఈనెల 20, 21 తేదీల్లో కడప జిల్లా వేంపల్లెలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయికి ఎంపికయ్యారని అన్నారు. ఎంపికైన విద్యార్థి పండును పాఠశాల హెచ్‌ఎం కోటయ్య, సీనియర్ ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శాస్త్రి, మహబూబ్‌బాషా, రవీంద్రారెడ్డి, శివశంకర్, పీఈటీ భారతి పాల్గొన్నారు.

సంజామల: రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు సంజామల వ్యాయామ సంచాలకులు బాషా ఎంపికయ్యారు. ఈ నెల 29న ఆదోనిలో జరిగిన 43వ జిల్లాస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో బాషా అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రెండు బంగారు పథకాలను సాధించారు. 40+ పురుషుల విభాగంలో నిర్వహించిన షాట్‌పుట్ త్రోలో జిల్లాస్థాయిలో ప్రథమ విజేతగా, జావెలిన్ క్రీడలో ప్రథమ విజేతగా నిలిచి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. త్వరలో విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో అరుణ కుమారి, ఉశేషనయ్య, నాగరాజు, చంద్రశేఖర్, వెంకట రంగన్న పాల్గొన్నారు.


వ్యాయామ సంచాలకుడు బాషాను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

వ్యాస రచన పోటీల్లో విద్యార్థిని ప్రతిభ


శిరివెళ్ల, సెప్టెంబరు 30: శిరివెళ్లలోని మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని కావ్య వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ ఇష్రత్ బేగం సోమవారం తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన స్వర్ణాంధ్ర వ్యాసరచన పోటీల్లో విద్యార్థిని కావ్య ద్వితీయస్థానం సాధించిందని చెప్పారు. కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణు చరణ్ చేతుల మీదుగా విద్యార్థిని కావ్య అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో రాణించిన కావ్యను ప్రిన్సిపాల్ ఇష్రత్ బేగం, ఉపాధ్యాయులు అభినందించారు.

'ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి'

చాగలమర్రి, సెప్టెంబరు 30: రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శివశంకర్, మండల అధ్యక్షుడు ఉసేన్‌బాషా, కార్యదర్శి సుబ్బారావు కోరారు. సోమవారం చాగలమర్రి ఎస్టీయూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల గ్రాంట్‌లు మంజూరు కాకపోవడంతో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు ఇబ్బందులు పడుతున్నారని, గ్రాంట్‌లు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలు మంజూరు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న పోస్టులను డీఎస్సీ ద్వార భర్తీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ ఆర్థిక కార్యదర్శి మాబుహుసేన్, మండల ఉపాధ్యక్షుడు వెంకటప్రసాద్, ఎస్టీయూ నాయకులు మహబూబ్‌బాషా, నారాయణరెడ్డి, శేషాద్రి, శ్రీనివాసులు, పెద్దవంగలి ప్రసాద్ పాల్గొన్నారు.

శరన్నవరాత్రుల బ్రోచర్ల ఆవిష్కరణ

చాగలమర్రి, సెప్టెంబరు 30: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ముత్యాలపాడు కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉత్సవాల బ్రోచర్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు ముడియం నరసింహారావు ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 3 నుంచి 14వ తేదీ వరకు దసరా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ అమ్మవారు ఆలయంలో వివిధ అలంకారాలతో భక్తులకు దర్శనమిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, ఎం.సురేష్‌బాబు, కార్యదర్శి గోపాలకృష్ణ, కోశాధికారి నరసింహయ్య, సహాయ కార్యదర్శి వెంకటరమేష్ పాల్గొన్నారు.


ముత్యాలపాడులో శరన్నవరాత్రుల బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్యులు